ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
5
పార్వతీపురం మన్యం
జిల్లా వార్తలు
శనివారం 16 నవంబరు 2024



ఆరోగ్య సర్వేలతో వ్యాధుల గుర్తింపు

గరుగుబిల్లి, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): వ్యాధుల గుర్తింపునకు ఆరోగ్య సర్వేలు చేపడుతున్నట్లు జిల్లా ప్రోగ్రాం అధికారి టి.జగన్మోహనరావు తెలిపారు. శుక్రవారం ఎస్ఆర్ పేటలో వైద్య సిబ్బంది చేపడుతున్న ఎన్‌సీడీ 3.0, సాస్ సర్వేలతో పాటు ఇతర ఆరోగ్య కార్యక్రమాల నిర్వహణ తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తుల ఆరోగ్యం, వైద్య పరీక్షల గురించి అడిగి తెలుసుకున్నారు. ఇప్పటివరకు 33 మందికి స్ర్కీనింగ్ చేశామని, వీరిలో ఐదుగురికి దీర్ఘకాలిక వ్యాధులు, ఒకరికి నోటి క్యాన్సర్ లక్షణాలు ఉన్నట్లు గుర్తించామని వైద్య సిబ్బంది తెలిపారు.

కొనుగోలు ఏదీ?

- వైసీపీ సర్కారు నిర్లక్ష్యం.. మిల్లర్లకు అందని బకాయిలు
- ఇప్పటివరకు బ్యాంకు గ్యారెంటీలు ఇవ్వని వైనం
- జిల్లాలో తెరుచుకోని ధాన్యం కొనుగోలు కేంద్రాలు
- ఆందోళనలో రైతులు.. రంగంలోకి దిగిన దళారులు

గరుగుబిల్లి, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ధాన్యం కొనుగోలు ప్రారంభించాలని.. మిల్లర్లు బ్యాంకు గ్యారెంటీ ఇవ్వాలని.. ఈ నెల మొదటి వారంలోనే కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ ఆదేశించారు. అయితే క్షేత్రస్థాయిలో పరిస్థితి మాత్రం మరోలా ఉంది. మిల్లర్ల నుంచి బ్యాంకు గ్యారెంటీలు రాకపోవడంతో ఇప్పటివరకు 'మన్యం'లో ఒక్క కేంద్రం కూడా ప్రారంభం కాలేదు. దీంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. నూర్పులు పూర్తయిన వారు పంటను నిల్వ చేసుకోలేక దళారులు, ప్రైవేట్ వ్యాపారులను ఆశ్రయిస్తున్నారు. గిట్టుబాటు ధర దక్కకపోయినా.. తప్పనిసరి పరిస్థితుల్లో వారికే పంటను విక్రయిస్తూ.. నష్టాలను చవిచూస్తున్నారు.

ఇదీ పరిస్థితి..

- ఈ ఏడాది జిల్లాలో ఖరీఫ్‌లో సుమారు 1.66 లక్షల ఎకరాల్లో వరి సాగు చేపట్టారు. ఈ మేరకు 15 మండలాల్లో 183 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు. వాటి పరిధిలో 3.25 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించాలని అధికారులు నిర్ణయించారు. సాధారణ రకం క్వింటాకు రూ. 2,300, గ్రేడ్-ఏకు రూ. 2,320 మద్దతు ధరగా ప్రకటించారు. మరోవైపు రైస్ మిల్లుల నుంచి గోనె సంచులను ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలకు తరలించారు. మిల్లుల పరిధిలో కస్టోడియన్ అధికారులుగా వీఆర్‌వోలను నియమించారు. మొత్తంగా 21,97,230 గోనె సంచులను సిద్ధం చేశారు. అయితే ఇప్పటివరకు కొనుగోలు కేంద్రాలు ప్రారంభం కాకపోవడంతో పీఏసీఎస్‌ల నుంచి గోనె సంచులు బయటకు వెళ్లని పరిస్థితి ఏర్పడింది.
- 15 మండలాల పరిధిలో ముందుగా తేలిక రకం వరి పంట నూర్పులు ప్రారంభమయ్యాయి. ప్రస్తుతం వాతావరణం అను కూలంగా ఉండటంతో ఒకవైపు ఆరబోత, మరోవైపు తూనికలు వేసే పనిలో నిమగ్నమయ్యారు. కాగా కొనుగోలు కేంద్రాలు ప్రారంభం కాక పోవడంతో ఈ ప్రాంతం నుంచి తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాలకు ధాన్యం తరలిపోతోంది. ఇదే అదునుగా వ్యాపారులు 84 కిలోలకు రూ.1,460 మాత్రమే చెల్లిస్తున్నారు. లారీల అద్దె పెరిగితే చెల్లింపుల్లో మరికొంత కోత విధిస్తున్నారు.

బకాయిల కోసం ఎదురుచూపు..


ధాన్యం కొనుగోలుకు సంబంధించి జిల్లాలో 93 మిల్లులను గుర్తించారు. అయితే ముందుగా మిల్లర్లు నిర్దేశించిన మొత్తాలను గ్యారంటీగా చూపించాలి. గ్యారెంటీ మొత్తం చెల్లిస్తేనే ఆ మిల్లుకు ధాన్యం సరఫరా చేస్తారు. కాగా గత వైసీపీ ప్రభుత్వం మిల్లర్లకు అధికంగా బకాయిలు చెల్లించాల్సి ఉంది. అవి విడుదలైతే ఆ మొత్తాలు చెల్లించి ధాన్యం పొందొచ్చన్న ఆలోచనలో పలువురు ఉన్నారు. మరికొంత మంది చెల్లింపులు చేసేందుకు సిద్ధమవుతు న్నారు. ఇదిలా ఉండగా జిల్లాలోని పలు మండలాల్లో నూర్పులు కావడంతో అధికార యంత్రాంగం గ్యారెంటీల కోసం మిల్లర్లపై ఒత్తిడి తెస్తున్నారు. అయినా ఇప్పటి వరకు 'మన్యం'లో ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటులో ఎటువంటి కదలికలు లేకపోవడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.



గరుగుబిల్లిలో తరలింపునకు సిద్ధంగా ఉన్న ధాన్యం బస్తాలు



ధాన్యం నిల్వలను తూకం వేస్తున్న దృశ్యం



సిబ్బందికి శిక్షణ పూర్తి

జిల్లాలో 183 ధాన్యం కొనుగోలు కేంద్రాల పరిధిలో సిబ్బందికి శిక్షణ పూర్తయ్యింది. ఒక్కో కేంద్రానికి ముగ్గురు చొప్పున నియమించిన తాత్కాలిక సిబ్బందికి కంప్యూటరీకరణ, ట్రక్ షీట్లు, మిల్లులకు తరలింపు, తేమ శాతం తెలుసుకోవడంపై అవగాహన కల్పించారు. మరోవైపు గోనె సంచులు సిద్ధమైనా ధాన్యం కొనుగోలు ప్రారంభం కాలేదు. కేంద్రాలు తెరవడం ఆలస్యమైతే రైతులు నష్టపోనున్నారు. నూర్పులు చేసిన ధాన్యం (మిగతా 8వ పేజీలో...)

ఘనంగా అయ్యప్ప పాలకావిళ్ల సంబరం

- ఆకట్టుకున్న దీక్షాధారుల తిరువీధి
- దారిపొడవునా భక్తుల పూజలు

6 లో



గిరిజనుల అభివృద్ధే ధ్యేయం

- జన జాతీయ గౌరవ దివస్‌లో కలెక్టర్ శ్యామ్ ప్రసాద్

పార్వతీపురం/ బెలగాం, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): గిరిజనుల అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తున్నట్లు కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ తెలిపారు. విద్యతో పేదరికం, దోపిడీ వంటి వ్యవస్థల నుంచి బయటపడొచ్చని.. ప్రగతి బాటలో పయనించొచ్చని చెప్పారు. ఐక్యతతో హక్కులు కాపాడుకో వచ్చన్నారు. బిర్సా ముండా జయంతి సందర్భంగా శుక్రవారం పార్వతీపురం ఐడీడీఏ ఆవరణలో జన జాతీయ గౌరవ దివస్‌ను ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన కలెక్టర్ మాట్లాడుతూ.. జన్‌మాన్ కింద రూ.75 కోట్లతో గిరిజన ప్రాంతాల్లో అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. గిరిజనుల విద్య, ఆరోగ్యానికి ప్రత్యేక చొరవ తీసుకున్నట్లు చెప్పారు. విద్యా, ఉద్యోగాల్లో గిరిజనులు ఉన్నత స్థానాల్లో ఉండాలని, క్రీడల్లోనూ సత్తా చాటి జాతీయ, అంత ర్జాతీయ స్థాయిలో పతకాలు సాధించాలని సూచించారు. గిరిజన వసతి గృహాల్లో మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. విద్యార్థులకు ఆరోగ్య సమస్యలు ఉంటే తెలియ జేయాలన్నారు.గిరిజనులకు ఉపాధి కల్పించే కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. వన్‌ధన్ కేంద్రాను బలోపేతానికి రూ.15.25 కోట్లు మంజూరు చేసినట్లు చెప్పారు. కొండ కోనల్లో ఉంటూ జీవనం సాగిస్తున్న గిరిజనులు చైతన్యవంతులు కావాలని ఎస్టీ కమిషన్ ఛైర్మన్ డీవీజీ శంకర్రావు అన్నారు. అనంతరం వారు వివిధ శాఖలు ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను పరిశీలించారు. గుమ్మ లక్ష్మీపురం, కురుపాం ఏకలవ్య , గిరిజన గురుకులం, రేగడి ఆశ్రమ పాఠశాల విద్యార్థులు థింసా నృత్యాలు, పలు సాంస్కృతిక ప్రదర్శనలతో అలరించారు. కార్యక్రమంలో ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో ఆశుతోష్ శ్రీవాస్తవ, ఎస్పీ మాధవ రెడ్డి, ఏసీపీ అంకిత సురాన, మున్సిపల్ ఛైర్‌పర్సన్ గౌరీశ్వరి, మాజీ ఎమ్మెల్యే నిమ్మక జయరాజు తదితరులున్నారు.



ఆకట్టుకున్న విద్యార్థుల నృత్య ప్రదర్శన



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్యామ్ ప్రసాద్

పాల ఉత్పాదకతను పెంచాలి

పార్వతీపురం, నవంబరు 15(ఆంధ్ర జ్యోతి): జిల్లాలో పాల ఉత్పాద కతను 15 శాతం పెంచాలని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో ప్రాథమిక రంగాల శాఖలతో ఆయన సమీక్షించారు. దాణాలో ఉత్తమ విధానాలు అవలంబించాలని సూచించారు. డీ వార్మింగ్, ఇమ్యునైజేషన్ విధిగా చేయాలన్నారు. సంతులిత ఆహారం అందించడంలో గోపాలమిత్రలు క్రియాశీలకంగా ఉండాలని ఆదేశించారు. ప్రతి మండలంలో ఐదు ఎకరాల్లో పశు గ్రాసం పెంపకానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రతినెలా డయల్ యువర్ డీఎహెచ్‌వో కార్యక్రమం నిర్వహించాలన్నారు. మరుగుదొడ్ల దినోత్సవం సందర్భంగా ఈ నెల 19 నుంచి డిసెంబరు 10వరకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ-క్రాప్‌లో నమోదైన జీడీ రైతులు వాతావరణ ఆధారిత పంటల బీమాకు అర్హులన్నారు. ఇతర వివరాలకు ఈ 95500 44894 నెంబర్‌కు ఫోన్ చేయాలని సూచించారు.

సీనియర్ సిటిజన్లకు ప్రయాణ రాయితీ

- టికెట్ ధరలో 25 శాతం మేర..
- ఉత్తర్వులు వెలువరించిన ఏపీఎస్ ఆర్టీసీ

6 లో

ఎనీవేర్ రిజిస్ట్రేషన్లకు సబ్‌రిజిస్ట్రార్లు మోకాలడ్డు

- భూ దరఖాస్తులను తిరిగి పంపుతున్న వైనం
- అనారోగ్య బాధితులు, వృద్ధులకు తప్పని ఇబ్బందులు

6 లో

ఇక కుదరదంతే!

- పాఠశాల ఆవరణలో ప్రైవేటు కార్యక్రమాలకు చెక్
- ఉత్తర్వులు జారీచేసిన స్కూల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్

6 లో

భక్తిశ్రద్ధలతో కార్తీక పౌర్ణమి

- ఆలయాల వద్ద జ్వాలాతోరణాలు
- ఇళ్లలో నోములు, వ్రతాలు

సాలూరు/భామిని, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): జిల్లా ప్రజలు శుక్రవారం కార్తీక పౌర్ణమిని భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. వేకువజామునే నదీ స్నానాలు ఆచరించి నీటిలో దీపాలు వదిలారు. అనంతరం శివాలయాలకు చేరుకున్నారు. గంటల తరబడి నిరీక్షించిన అనంతరం ముక్కంటిని దర్శించుకుని అర్చనలు, అభిషేకాలు చేశారు. మహిళలు ఉదయం నుంచి ఉపవాస దీక్షలు చేశారు. సాయంత్రం ఇళ్లలో ప్రత్యేక పూజలు, నోములు నోచారు. వాయనాలు ఇచ్చారు. సామూహిక సత్యనారాయణ వ్రతాలను చేపట్టారు. సాలూరు పంచముఖేశ్వరస్వామి ఆలయం వద్ద దీపోత్సవం, జ్వాలాతోరణం వంటి కార్యక్రమాలు నిర్వహించారు. మరోవైపు పార్వతీపురం, పాలకొండ, కురుపాంతో పలు మండలాల్లోని శైవ క్షేత్రాల్లోనూ కార్తీక సందడి నెలకొంది. భామిని మండలం లివిరిలోని గోపీనాథస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులకు రాధారాణి పాద దర్శన భాగ్యం కల్పించారు. ఏటా కార్తీకమాసంలో నిర్వహించే ఈ కార్యక్రమానికి భామిని పరిసర ప్రాంతాలతో పాటు ఒడిశా నుంచి కూడా పెద్దఎత్తున భక్తజనం తరలివచ్చారు. మొత్తంగా అంతటా ఆధ్యాత్మిక శోభ వెల్లివిరిసింది.



పూజలందుకున్న గోపీనాథ రాధాస్వామి



సాలూరు శివాలయంలో జ్వాలాతోరణం దర్శిస్తున్న భక్తులు

ఇంటింటికీ జియోట్యాగింగ్

- జిల్లాలో శరవేగంగా జరుగుతున్న ప్రక్రియ
- ఇప్పటికే 1,07,344 గృహాలు పూర్తి
- ముందంజలో పార్వతీపురం మండలం
- మరో వారం రోజుల్లో పూర్తి చేసేందుకు అధికారుల చర్యలు

పార్వతీపురం/కొమరాడ, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఇంటింటికీ జియోట్యాగింగ్ ప్రక్రియ శరవేగంగా జరుగుతోంది. 'మన్యం'లో 3,03,111 గృహాలు ఉండగా, ఇప్పటివరకు 1,07,344 ఇళ్లకు జియోట్యాగింగ్ పూర్తయింది. మిగిలిన 1,95,767 ఇళ్లను మరో వారం రోజుల్లో పూర్తి చేసేందుకు ప్రణాళికలను రూపొందించారు. ఈ కార్యక్రమానికి సంబంధించి పార్వతీపురం మండలం మొదటి స్థానంలో ఉండగా, కొమరాడ మండలం చివరి స్థానంలో ఉంది. పార్వతీపురం మండలంలో 2,21,241 ఇళ్లకు గాను ఇప్పటివరకు 10,919 గృహాలకు ట్యాగింగ్ పూర్తయింది. కొమరాడ మండలంలో 17,096 ఇళ్లకు గాను కేవలం 3,938 గృహాలకు మాత్రమే పూర్తి చేశారు.



పార్వతీపురం మండలం లక్ష్మీనారాయణపురంలో జియోట్యాగింగ్ చేస్తున్న దృశ్యం

ఒక్కొక్క ఉద్యోగికి 160 ఇళ్ల బాధ్యత

హౌస్ హోల్డ్ జియో ట్యాగింగ్ బాధ్యతలను సచివాలయ ఉద్యోగులకు ప్రభుత్వం అప్పగించింది. ఒక్కొక్క ఉద్యోగి 100 నుంచి గరిష్ఠంగా 160 ఇళ్లను జియో ట్యాగింగ్ చేయాలి. ప్రస్తుతం సాంకేతిక సమస్యల కారణంగా జియో ట్యాగింగ్ కొన్ని చోట్ల మందకొడిగా సాగుతుంది. ఈ ప్రక్రియ పూర్తయితే జిల్లాలో ఎన్ని గృహాలు ఉన్నాయన్నది పక్కాగా లెక్క తేలనుంది.

ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న ప్రభుత్వం

కూటమి ప్రభుత్వం హౌస్ హోల్డ్ జియో మ్యాపింగ్‌ను ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంది. జిల్లాలో ప్రతి ఇంటినీ ప్రభుత్వంతో అనుసంధానిస్తుంది. జీఎస్‌డబ్ల్యూఎస్ ఎంప్లాయిస్ అనే యాప్‌లో జియో ట్యాగింగ్ చేస్తారు. ఆ యాప్‌లో ప్రతి ఇంటి ఫొటో, డోర్ నెంబరు, లోకేషన్‌ను గ్రామ, వార్డు సచివాలయ సిబ్బంది అప్‌లోడ్ చేస్తున్నారు. ప్రతి కుటుంబం వద్దకు సచివాలయ ఉద్యోగులు వెళ్లి ఆ కుటుంబానికి చెందిన ఇంటిని అప్‌లోడ్ చేస్తున్నారు. వాటిని ధ్రువీకరించేలా కుటుంబ సభ్యుల్లో ఒకరితో ప్రత్యేక డివైజ్ ద్వారా వేలి ముద్రలు, ఫేస్, ఐరీష్ పద్ధతిలో ఆమోదం తీసుకుంటున్నారు. గతంలో సంక్షేమ పథకాల ఆధారంగా హౌస్ హోల్డ్ మ్యాపింగ్ ఉండేది. ఉదాహరణకు పింఛన్లకు సంబంధించి ఒక మ్యాపింగ్, రేషన్‌కార్డులకు సంబంధించి మరొక మ్యాపింగ్ ఉండేది. ఫలితంగా ఆయా పథకాల పంపిణీకి మాత్రమే అవి ఉపయోగపడేవి. ఈ చిక్కులను తొలగించి మొత్తం వ్యవహారాన్ని ఒక చోటికి చేర్చేలా ప్రభుత్వం అడుగులు వేస్తోంది. ప్రతి ఇంటికి సంబంధించి ఆ ఇల్లు ఉండే అక్షాంశం, రేఖాంశం ఆధారంగా జియో ట్యాగింగ్ చేస్తుంది. ఈ పద్ధతి ద్వారా ఎవరెక్కడ ఉన్నారనే విషయం సెకండ్లలో తేలిపోతుంది. ఒక వ్యక్తి, ఆ కుటుంబ సభ్యులు, వారు నివశించే ఇల్లు, ఆ గృహం పూరిల్లా, రేకిల్లా, పక్కా ఇల్లా వంటి వివరాలు, వీధి సమాచారంతో సహా మొత్తం అధికారుల లాగిన్‌లో కనిపిస్తాయి. మ్యాపుల్లో వారున్న ప్రదేశం కనిపిస్తుంది.

ఎంతో ఉపయోగం..

ఏవైనా విపత్తులు సంభవించినప్పుడు ఎవరు ఎక్కడ ఉన్నారో, ఏ విధంగా ఉన్నారో ఒక్కొక్కసారి తెలియని పరిస్థితి ఉంటుంది. దీంతో వారిని గుర్తించేందుకు ఎన్నో కష్టాలు ఎదుర్కొవాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. ఇటువంటి పరిస్థితి లేకుండా ఉండేందుకు ప్రభుత్వం ఈ కార్యక్రమం ప్రారంభిం చింది. ఇటీవల సంభవించిన విజయవాడ వరదలను దృష్టిలో (మిగతా 8వ పేజీలో...)



కొమరాడలో..

● రేపు కావ్యకంఠ వాశిష్ట గణపతి ముని జయంతి ● రేణుకాదేవి వరం పొందినట్లు అనుభూతి
● నాయన స్వగ్రామం కలువరాయి

ఆధ్యాత్మిక చైతన్యమూర్తి



వాశిష్ట గణపతి ముని

బొబ్బిలి, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): భగవాన్ శ్రీరమణ మహర్షికి అత్యంత ప్రీతిపాత్రుడైన కావ్యకంఠ గణపతి ముని బొబ్బిలి మండలం కలువరాయి గ్రామానికి చెందిన వారు. గణపతి ముని బహుముఖ ప్రజ్ఞాశాలి, మహాతపస్వి, దేశభక్తుడు, సంఘ సంస్కర్త. మద్రాసులో దొరైస్వామి, శంకరశాస్త్రి ఆయనకు శిష్యులుగా మెలిగారు. అక్కడ సముద్ర ప్రాంతంలో వారు పెద్ద సంఖ్యలో యువతను గణపతి ముని దగ్గరకు తీసుకొచ్చి స్వాతంత్ర్యోద్యమం ఆవశ్యకతను వివరించేవారు. అభూత కల్పనలతో అల్లిన కథలను పురాణ, కావ్య, ప్రబంధ, నాటకాది గ్రంథాల నుంచి తొలగించారు. భరతజాతి యోధులను వెలుగులోకి తెచ్చేందుకు విశేష కృషి చేశారు. స్త్రీ, పురుష వర్గభేదాలు లేకుండా చైతన్యపరిచారు. విద్యార్థులలో వేదమతాభిమానంతో కూడిన దేశభక్తిని రగిలించడంలో గణపతి ముని విశేషమైన కృషి చేశారు. బ్రాహ్మణ విద్యార్థులతో ఇంద్ర సంఘాన్ని ఏర్పాటు చేసి 'ఉమాం వందే మాతరం' అనే మంత్రంతో వారిలో చైతన్యస్ఫూర్తిని రగిలించారు. అప్పట్లో ఆయన వ్యవహార శైలిపై బ్రిటీషు ప్రభుత్వం విచారణ చేపట్టింది.

తిరుగుబాటుకు కారణమని..

గణపతి ముని మంత్రదీక్షల పేరుతో యువతను ప్రభుత్వంపై తిరుగుబాటుకు పురిగొల్పుతున్నారని మరోసారి పోలీసులు విచారణ చేపట్టారు. తమిళనాడులోని పడైవీడు ప్రాంతాన్ని వదలి వెళ్లాలని హెచ్చరించారు. ఆ హెచ్చరికను పెడచెవిన పెట్టి 40 రోజులు తపస్సు చేశారు. ఆ సమయంలోనే రేణుకాదేవి ప్రత్యక్షమై కుమార స్వామి చేతిలోని 'శక్తి' అనే ఆయుధాన్ని ఇచ్చినట్లుగా గణపతిముని అనుభూతిని పొందారు. అస్త్ర విద్యా మహామంత్రాన్ని పొందిన ఆయన తన శిష్యులకు ఉపదేశించారు. వారి సంఘాన్ని బలోపేతం చేశారు. ఇది తిరుగుబాటుదారుల సంఘంగా భావించి ప్రభుత్వం ఆయనను అరెస్టు చేసి జైలులో పెట్టింది. ఆ తరువాత ఓ పోలీసు అధికారి ఆయన నుంచి మంత్రదీక్ష తీసుకొని శిష్యుడిగా మారడం గమనార్హం.

స్త్రీ, పురుషులు సమానమేనని..

1923 డిసెంబరులో కాకినాడలో జరిగిన అఖిల భారత కాంగ్రెస్ మహాసభకు బులుసు సాంబమూర్తి ఆహ్వానం మేరకు నాయన హాజరయ్యారు. పురుషులతో పాటు స్త్రీలకు సమాన హక్కు ఉందని వేదశాస్త్ర ప్రమాణాలతో ఆ సభలో రుజువు చేశారు. ఉపనయనం, హోమం, శ్రాద్ధం తదితర అంశాలలో సమాన హక్కుల విషయాన్ని ఆయన నొక్కి వక్కాణించారు. హైదరాబాద్‌లో ఆది హిందూ సంఘం (దళితులు) నాయనను పల్లకిలో ఊరేగించి 'ముని' అనే బిరుదుతో సత్కరించారు. దేశభక్తి, దేశోద్ధారణ కాంక్షలతో 'రాష్ట్ర నిబంధనము' గ్రంథాన్ని, సంస్కృతం ప్రపంచభాష కావాలని కాంక్షిస్తూ 'లాలి భాషో పదేః' అనే గ్రంథాన్ని రచించారు. 1929 వరకు హరిజనోద్ధరణ కోసం కృషి చేశారు.

1878 నవంబరు 17న అయ్యల సోమయాజుల నరసింహశాస్త్రి- నరసమాంబలకు గణపతి ముని జన్మించారు. కలువరాయి గ్రామంలో ధ్యానంలో ఉండగా గణపతిమునికి పూర్వ జన్మ వృత్తాంతాన్ని వివరించడంతో ఆయన తపోయాత్రలకు ఇక్కడి నుంచి దేశంలోని వివిధ పుణ్యక్షేత్రాలకు వెళ్లినట్లు చెబుతున్నారు.

కలువరాయి గ్రామంలో ఆశ్రమం

గణపతిముని జన్మించిన కలువరాయి గ్రామంలో హైదరాబాద్‌కు చెందిన పరాశరన్ నరసింహం ఆధ్వర్యంలో 20 ఏళ్ల క్రితం ఆశ్రమాన్ని ఏర్పాటు చేశారు. అక్కడ శ్రీఅరుణాచల రమణ గణపతి నిత్య పూజ, నెలకోసారి శ్రీగణపతి హోమం, ఉమా సహస్ర పారాయణం, ఇంద్రాణి సప్త శతీ పారాయణం, అన్నదాన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఏటా రమణ మహర్షి జయంతి, ఆరాధన, భగవాన్ రమణుల అరుణాచల ఆగమన దినం, నాయనకు భగవాన్ చేసిన మౌఖిక ఉపదేశం, అరుణాచల కృత్తికా దీపం, కావ్యకంఠ శ్రీవాసిష్ఠ గణపతిముని (నాయన) జయంతి, నిత్య అభిషేకం వంటి కార్యక్రమాలను ఘనంగా నిర్వహిస్తారు. అర్చకులు వీవీ సత్యనారాయణశర్మ (వేణుశర్మ) ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలన్నిటినీ నిర్వహిస్తారు. ఈ నెల 17న గణపతిముని జయంతి కార్యక్రమానికి దేశం నలుమూలల నుంచి భక్తజనం కలువరాయి గ్రామానికి విచ్చేస్తారు. గణపతి ముని వారసులు రాయ్‌పూర్ ప్రాంతంలో స్థిరపడ్డారు.



కలువరాయిలోని ఆశ్రమం

రమణ మహర్షి పరిచయం

1907 నవంబరు 18న అరుణాచలంలో రమణ మహర్షిని దర్శించుకున్నారు. నాయనకు గణపతి మునిగా నామకరణం చేసింది ఆయనే. రామకృష్ణ పరమహంసకు వివేకానందుని మాదిరిగా శ్రీరమణ మహర్షి సందేశాలను కావ్యకంఠ గణపతిముని వ్యాప్తిలోకి తెచ్చారు. 1928లో అరవిందులతో గణపతిముని సమావేశమయ్యారు. రాజకీయాలను విరమించుకున్న తరువాత పూర్తిగా ఆధ్యాత్మిక రంగంలో మహోన్నతమైన స్థితికి చేరుకున్నారని, ముని పరమపదించిన తరువాత కూడా 14 సంవత్సరాల పాటు జీవించి ఉన్నట్లుగా ఆయన దివ్య లీలలు నిరూపించినట్లు భక్తజనం చెబుతున్నారు. 1935 జూలై 25న ఆయన భౌతిక దేహాన్ని త్యజించారు. 'రమణ గీత, సద్విద్య, , రమణ చత్వారింశత్ వంటి గ్రంథాలు రచించారు.

అక్కడ కుదరదు.. ఇక్కడకు రావాల్సిందే



● ఎనీవేర్ రిజిస్ట్రేషన్లకు సబ్‌రిజిస్ట్రార్లు మోకాలడ్డు
● భూ దరఖాస్తులను తిరిగి పంపుతున్న వైనం
● అనారోగ్య బాధితులు, వయోవృద్ధులకు తప్పని ఇబ్బందులు
● బొబ్బిలిలో విక్రయించని నాన్‌జ్యూడిషియల్ స్టాంపులు

● బొబ్బిలి మండలం కారాడకు చెందిన ఓ 90 ఏళ్ల వృద్ధుడికి తెర్లాం మండలం నందబలగ పరిధిలో భూములు ఉన్నాయి. అతను డయాలసిస్ పేషెంట్. ఓ భూమి రిజిస్ట్రేషన్‌కి సంబంధించి తెర్లాం రాలేనని, బొబ్బిలిలో చేసుకుంటామని, ఎనీవేర్ రిజిస్ట్రేషన్‌కు ఆయన ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నాడు. దీనికి తెర్లాం సబ్‌రిజిస్ట్రార్ ఒప్పుకోకపోవడంతో ఆ వృద్ధుడు అక్కడి కార్యాలయానికి వెళ్లాల్సి వచ్చింది.

● బొబ్బిలిలో నివాసముంటున్న ఓ వ్యక్తి అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఇతనికి మక్కువలో భూములు ఉన్నాయి. ఈ భూములు సాలూరు సబ్‌రిజిస్ట్రేషన్ కార్యాలయ పరిధిలోకి వస్తాయి. ఓ భూమికి సంబంధించి ఎనివేర్ రిజిస్ట్రేషన్ కోసం దరఖాస్తు చేసుకున్నాడు. బొబ్బిలిలో రిజిస్ట్రేషన్ కుదరదని, సాలూరు రావాల్సిందేనని సబ్‌రిజిస్ట్రార్ చెప్పడంతో ఆ వ్యక్తి అక్కడకు వెళ్లక తప్పలేదు.

బొబ్బిలి నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పలువురు రిజిస్ట్రార్లు ఎనీవేర్ రిజిస్ట్రేషన్లకు సహకరించడం లేదనే విమర్శలు ఉన్నాయి. ఇలాంటి రిజిస్ట్రేషన్ల కోసం నేరుగా కార్యాలయాలకే రావాలని వారు చెబుతుండడంతో భూములు, ఇతర ఆస్తుల క్రయవిక్రయదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆస్తులు ఉన్న ప్రాంతంలోనే కాకుండా రాష్ట్రంలో ఎక్కడైనా ఎనీవేర్ రిజిస్ట్రేషన్ పేరిట వాటిని రిజిస్ట్రేషన్ చేసుకొనే వెసులుబాటును ప్రభుత్వం కల్పించింది. ఎక్కడికీ కదలలేని స్థితిలో అనారోగ్యంతో బాధపడుతున్న వారు, వయోవృద్ధుల వంటి వారికి ఎనీవేర్ రిజిస్ట్రేషన్ విధానం ఎంతో సౌకర్యంగా ఉంటుంది. అయితే, ఈ విధానానికి ఉమ్మడి జిల్లాలోని తెర్లాం, సాలూరు, కురుపాం, విజయనగరం రూరల్ సబ్‌రిజిస్ట్రార్లు సహకరించడం లేదనే విమర్శలు ఉన్నాయి. ఎనీవేర్ రిజిస్ట్రేషన్ల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తులను పంపుతున్నప్పటికీ కొంతమంది సబ్‌రిజిస్ట్రార్లు తిరస్కరిస్తున్నారు. భూములు, ఆస్తుల రిజిస్ట్రేషన్లకు తమ వద్దకు నేరుగా రావాల్సిందేనని వారు చెబుతున్నట్లు బొబ్బిలి ప్రాంతానికి చెందిన పలువురు క్రయవిక్రయదారులు వాపోతున్నారు. చేసేది లేక ఈసురోమంటూ దూర ప్రాంతాల్లోని సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయాలకు వెళ్లకతప్పడం లేదు. ఉన్నతాధికారులు స్పందించి ఎనీవేర్ రిజిస్ట్రేషన్ విధానం పగడ్బందీగా అమలయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

నాన్‌జ్యూడిషియల్ స్టాంపులు అమ్మట్లే!

బొబ్బిలి సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో నాన్‌జ్యూడిషియల్ బాండ్ పేపర్లు, స్టాంపులు తగినన్ని స్టాకు ఉన్నప్పటికీ వాటిని విక్రయించడం లేదు. దీంతో దీంతో వినియోగదారులు చాలా ఇబ్బందులు పడుతున్నారు. 10, 20, 50, 100 రూపాయల స్టాంపు పేపర్లకు ప్రతీ రోజూ చాలా డిమాండ్ ఉంటుంది. బొబ్బిలి, చుట్టుపక్కల మండలాల వారంతా వచ్చి వాటిని కొనుగోలు చేస్తుంటారు. అలాగే స్థానికంగా గల కోర్టు సముదాయాల పరిధిలోని వందలాదిమంది న్యాయవాదులకు కూడా ఈ స్టాంపుల అవసరం చాలా ఉంటుంది. దీనిపై ఇప్పటికే రాష్ట్ర న్యాయవాదుల సంఘం నాయకుడు కండాపు ప్రసాదరావు అధికారులకు లేఖలు రాశారు. అయినప్పటికీ స్టాంపుల అమ్మకానికి సంబంధించిన కౌంటరును ఇంకా ప్రారంభించలేదు. దీనితో స్టాంపులు అవసరం ఉన్నవారంతా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

ఇబ్బంది పెట్టడం తగదు

ఎనీవేర్ రిజిస్ట్రేషన్‌కు కొంతమంది సబ్ రిజిస్ట్రార్లు మోకాలడ్డుతున్నారు. బొబ్బిలి సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం నుంచి వెళ్తున్న భూ దస్త్రాలను రిజిస్ట్రేషన్ చేసేందుకు ఉమ్మడి జిల్లాకు చెందిన తెర్లాం, సాలూరు, కురుపాం, విజయనగరం రూరల్ సబ్ రిజిస్ట్రార్లు సహకరించడం లేదు. వారి వద్దే రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని చెబుతున్నారు. దీనివల్ల వయోవృద్ధులు, అనారోగ్యంతో బాధపడుతున్న వారు చాలా ఇబ్బందులు పడుతున్నారు. వారిని ఇబ్బందులు పెట్టడం తగదు.

- పక్కి పార్థసారధి, శ్రీపతి రాంబాబు, డాక్యుమెంట్ రైటరు, బొబ్బిలి

సబ్ రిజిస్ట్రార్లతో మాట్లాడతా..

ఎనీవేర్ రిజిస్ట్రేషన్లు చేసేందుకు వస్తున్న ఇబ్బందులేంటో సబ్ రిజిస్ట్రార్లను అడిగి తెలుసుకుంటాను. తెర్లాం, విజయనగరం రూరల్ సబ్‌రిజిస్ట్రార్ల నుంచి వివరణ కోరతాను. సమస్యను పరిష్కరిస్తాను. పార్వతీపురం మన్యం పరిధిలో ఉన్నవి నా పరిధి కాదు. బొబ్బిలి సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో నాన్‌జ్యూడిషియల్ స్టాంపులు అందుబాటులో ఉన్నాయి. సేల్స్ ప్రారంభించలేదన్నది వాస్తవం. ఆన్‌లైన్ మాడ్యూల్‌ను చేయమని ఆదేశాలు ఉన్నాయి. వీటి అమ్మకాలు ఆన్‌లైన్‌లో మాత్రమే జరగాలని ఆదేశాలు ఉన్నాయి. నేరుగా అమ్మకాలు జరపడం కుదరదు. ఈ స్టాంపుల అమ్మకం ప్రక్రియ త్వరలోనే ప్రారంభమవుతుంది.

- ఏవీ కుమారి, జిల్లా రిజిస్ట్రార్, విజయనగరం



బొబ్బిలి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం

పదికి పక్కా ప్రణాళిక

● ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు రోజువారి టెస్టులు
● మొదటి సెమిస్టర్ సిలబస్ పూర్తి
● రెండో సెమిస్టర్ సిలబస్ ప్రారంభం
● రోజూ ఉదయం, సాయంత్రం ప్రత్యేక క్లాసులు
● ఉత్తమ ఫలితాలు లక్ష్యంగా విద్యాశాఖ ప్రత్యేక దృష్టి

విజయనగరం కలెక్టరేట్, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు లక్ష్యంగా ప్రభుత్వం ప్రణాళికలు తయారుచేసింది. సబ్జెక్టుల వారీగా ప్రత్యేక తరగతులు నిర్వహించి, రోజు వారీ టెస్టులు పెడుతోంది. మంచి ఫలితాలు తీసుకుని వచ్చేలా చర్యలు చేపట్టింది. అధికారులు కూడా తరగతి గదిలో వెనుకబడిన విద్యార్థులపై శ్రద్ధ పెట్టారు. శతశాతం ఉత్తీర్ణతతో పాటు అత్యధిక మార్కులు సాధించేలా కార్యాచరణ తయారు చేశారు. గత నెల 31తో మొదటి సెమిస్టర్ సిలబస్ పూర్తి కాగా, ఈనెల మొదటి నుంచి రెండో సెమిస్టర్ మొదలు అయింది. ఇది ఇలా ఉంటే కేంద్రవ తీసుకుని వచ్చిన అపార్ కార్డులో వివరాల నమోదు కొందరు విద్యార్థులకు కాస్త ఇబ్బందిగా మారింది. 2011లో ఆధార్ నమోదు చేసిన సమయంలో చాలా పొర పాట్లు ఉండటంతో వాటిని పాఠశాల రికార్డు ప్రకారం సరి చేసుకోవడానికి విద్యార్థుల తల్లిదండ్రులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

23,167 మంది పదో తరగతి విద్యార్థులు

జిల్లా వ్యాప్తంగా 433 పాఠశాలల్లో 23,167 మంది విద్యార్థులు పదో తరగతి చదువుతున్నారు. 13 ఏపీ మోడల్ స్కూళ్లలో 1160మంది, రెండు ఏపీఆర్ఈఐ సొసైటీ స్కూళ్లలో 161 మంది, ఎనిమిది ఏపీఎస్‌డబ్ల్యూఆర్ఈఐ సొసైటీ పాఠశాలల్లో 560 మంది, 7 బీసీ వెల్ఫేర్ పాఠశాలల్లో 412 మంది, ఒక ప్రభుత్వ ఓరియంట్ పాఠశాలలో 66 మంది, 26 కేజీబీవీల్లో 974 మంది, 218 ఎంపీపీ, జెడ్పీ స్కూళ్లలో 11679 మంది, ఒక ప్రైవేటు పాఠశాలలో 147 మంది, 135 ప్రైవేటు అన్‌ఎయిడెడ్‌లో 6348 మంది, ఒక ప్రైవేటు అన్ ఎయిడెడ్‌లో 9 మంది, రెండు ప్రైవేటు అన్ ఎయిడెడ్‌లలో 28 మంది, 7 ప్రభుత్వ పాఠశాలల్లో 707 మంది విద్యార్థులు, 7 గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో 211 మంది చదువుతున్నారు.

మూడు ఫేజ్‌ల ద్వారా సెల్ఫ్ టెస్టులు

ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు డీసీఈబీ అధ్వర్యంలోని మూడు ఫేజ్‌ల ద్వారా సెల్ఫ్ టెస్టులు నిర్వహిస్తున్నారు. ప్రతిరోజూ రోజు డీసీఈ బోర్డు పరీక్ష పేపర్లను జిల్లా పరిషత్ పాఠశాలలకు పంపిస్తారు. వాటిని డౌన్‌లోడ్ చేసుకుని విద్యార్థులకు పరీక్షలు నిర్వహిస్తున్నారు. ప్రతి సబ్జెక్టు 20 మార్కులకు ప్రతిరోజూ సాయంత్రం 4 నుంచి 5 గంటల మధ్య సెల్ఫ్ టెస్టులు పెడుతున్నారు. సెప్టెంబరు 30 నుంచి డిసెంబరు 4వ తేదీ వరకూ మొదటి ఫేజ్ ద్వారా నాలుగు సెల్ఫ్ టెస్టులు జరగనున్నాయి. రెండో ఫేజ్‌లో డిసెంబరు 5 నుంచి అదే నెల 31 వరకు మూడు సెల్ఫ్ టెస్టులు నిర్వహించనున్నారు. మూడో ఫేజ్‌లో వచ్చే ఏడాది జనవరి 1 నుంచి మార్చి 7వ తేదీ వరకు మూడు సెల్ఫ్ టెస్టులు నిర్వహిస్తారు. అనంతరం గ్రాండ్ టెస్టులు పెడుతారు.

ప్రస్తుతం నిర్వహిస్తున్న సెల్ఫ్ టెస్టుల్లో తక్కువ మార్కులు వచ్చిన విద్యార్థులను గుర్తించి వారికి మెరుగైన శిక్షణ ఇస్తున్నారు. ఈ సెల్ఫ్ టెస్టులు విద్యార్థులకు చాలా ఉపయోగ పడుతున్నాయి.

18 లోగా పరీక్ష ఫీజు చెల్లింపు

ప్రస్తుతం పదో తరగతి చదువుతున్న విద్యార్థులు వచ్చే ఏడాది మార్చి, ఏప్రిల్ నెలలో జరిగే పబ్లిక్ పరీక్షలకు ఈనెల 18 లోగా పరీక్ష ఫీజు చెల్లించాల్సి ఉంది. ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా 95 శాతం పైబడి పరీక్ష ఫీజు చెల్లించారు.



లక్కిడాం జడ్పీ పాఠశాలలో టెన్త్ విద్యార్థులకు బోధిస్తున్న ఉపాధ్యాయుడు

సీనియర్ సిటిజన్లకు ప్రయాణ రాయితీ

● టికెట్ ధరలో 25 శాతం మేర..
● ఉత్తర్వులు వెలువరించిన ఏపీఎస్ఆర్టీసీ

రాజాం రూరల్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించే సీనియర్ సిటిజన్లకు రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ రాయితీ ప్రకటించింది. 60 ఏళ్లు దాటిన వారు తమ స్వస్థలం నుంచి బస్సుల్లో ప్రయాణించే సమయంలో టికెట్ ధరలో 25 శాతం తగ్గించి చెల్లించవచ్చని స్పష్టం చేసింది. ఈమేరకు ఏపీ ఎస్ఆర్టీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (ఆపరేషన్స్) ఈ నెల 13న ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో ఉన్న రాయితీ ఉత్తర్వులను పరిగణనలోనికి తీసుకుని రాయితీని 25 శాతానికి పెంచుతూ కొత్తగా ఆదేశాలు ఇచ్చారు. అయితే ప్రయాణ సమయంలో సీనియర్ సిటిజెన్లు తన గుర్తింపు కార్డును కండక్టర్ చూపించాల్సి ఉంటుంది. ఆధార్, సీనియర్ సిటిజన్ ఐడీ కార్డు, పాన్‌కార్డు, ఓటర్ ఐడీ కార్డు, పాస్‌పోర్ట్, రేషన్‌కార్డులలో ఏదైనా ఒకటి టికెట్ కొనుగోలు సమయంలో చూపించాల్సి ఉందని ఆ ఉత్తర్వుల్లో ఆర్టీసీ ఈడీ స్పష్టం చేశారు. ఈ అవకాశాన్ని సీనియర్ సిటిజన్లు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఇబ్బంది ఉండకూడదనే..

సీనియర్ సిటిజన్లకు ఈ ఉత్తర్వులు ఓ వరం. పేద, మధ్య తరగతి వారికి ప్రయాణంలో రాయితీ కల్పించడం గతంలో కూడా ఉండేది. అయితే ప్రయాణ సమయంలో బస్సుల్లో కొన్ని సమస్యలు తలెత్తుతున్నాయి. సమాచార లోపం వల్ల కొంతమంది సీనియర్ సిటిజన్లు ఇబ్బందులు పడుతున్నారు. వాటిని అధిగమించేందుకు ఆర్టీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ తాజాగా మరోసారి ఉత్తర్వులు జారీ చేశారు. సీనియర్ సిటిజన్లకు ఆర్టీసీ కల్పిస్తున్న రాయితీని వారు సద్వినియోగం చేసుకోవడంలో కండక్టర్లు, ఇతర సిబ్బంది సహకరించాలని ఆదేశించాం.

- కె.శ్రీనివాస్, డీఎం, ఏపీఎస్ఆర్టీసీ, విజయనగరం



ఇక కుదరదంతే!

● పాఠశాల ఆవరణలో ప్రైవేటు కార్యక్రమాలకు చెక్
● ఉత్తర్వులు జారీచేసిన స్కూల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్

రాజాం రూరల్, నవంబరు 15(ఆంధ్రజ్యోతి)! ప్రభుత్వ పాఠశాలల ప్రాంగణాలలో ప్రైవేటు కార్యక్రమాల నిర్వహణకు ప్రభుత్వం చెక్ పెట్టింది. ఇకపై తరగతుల నిర్వహణకు ముందు, తరువాత రాజకీయ, కుల, మతపరమైన కార్యక్రమాలతో పాటు వివాహాల నిర్వహణకు వీలుకాదని ఆ ఉత్తర్వుల్లో పేర్కొంది. ఈ ఉత్తర్వులు బేఖాతరు చేస్తే అధికారులపై చర్యలు తప్పవని ఆ ఉత్తర్వుల్లో హెచ్చరించింది. ఈ మేరకు డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ వీవీ జయరామరాజు రీజినల్ జాయింట్ డైరెక్టర్లు (ఆర్జేడీ), జిల్లా విద్యాశాఖాధికారులకు ఈనెల 14న ఆదేశాలు జారీ చేశారు. ఉత్తర్వులు తక్షణమే అమల్లోకి వస్తాయని, వారి పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల ప్రాంగణాలలో ఇకపై ఇలాంటి కార్యక్రమాల నిర్వహణకు అనుమతులివ్వవద్దని అందులో పేర్కొన్నారు.

Government of Andhra Pradesh
Department of School Education

సభలు, సమావేశాలకు వేదికలుగా..

పల్లె నుంచి పట్టణం వరకూ ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల ప్రాంగణాలు రాజకీయ సభలు, సమావేశాలు, పెళ్లిల్లు, ఇతరత్రా ఫంక్షన్లకు వేదికలుగా కొనసాగేవి. జిల్లాలో ఇది చాలాచోట్ల కొనసాగుతోంది. గ్రామస్థాయి నుంచి జిల్లా కేంద్రం వరకూ స్థానిక నాయకుల ఒత్తిడితో ప్రైవేటు కార్యక్రమాలకు అనధికారికంగా అనుమతి ఇచ్చేవారు. ఓవైపు తరగతులు కొనసాగుతుంటే మరోవైపు మైకుల హోరు, నాయకుల ప్రసంగాల జోరు కొనసాగేది. ఆదివారాలతో పాటు ఇతర సెలవు దినాలలో చావులు, పెళ్లిల్లు ఇతర కార్యక్రమాల నిర్వహణ, పంక్తి భోజనాలకు సైతం పాఠశాల ప్రాంగణాలు కేరాఫ్ అడ్రస్‌గా మారేవి. ఉద్యోగరీత్యా వచ్చే ప్రధానోపాధ్యాయులు, కళాశాలల ప్రిన్సిపాళ్లు స్థానికుల, రాజకీయ నాయకుల ఒత్తిడిని కాదనలేని పరిస్థితుల్లో సహకరించాల్సిన దుస్థితి ఎదురయ్యేది. వైసీపీ హయాంలో మంత్రులు ప్రభుత్వ కార్యక్రమాలు పాఠశాల ప్రాంగణంలోనే నిర్వహించిన సందర్భాలు ఉన్నాయి. అప్పట్లో విద్యార్థులు, ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బంది పడ్డారు. ఫిర్యాదు చేస్తే ఎక్కడ కోపం వస్తుందేమోనని మిన్నకుండిపోయారు. కూటమి ప్రభుత్వం తాజా ఉత్తర్వులతో ఇకపై ప్రభుత్వ పాఠశాలల ప్రాంగణాలలో ప్రైవేటు కార్యక్రమాల నిర్వహణతో పాటు శబ్ద కాలుష్యానికి చెక్ పడనుంది.

నిబంధనలు పాటించాలి

ప్రభుత్వ ఉత్తర్వులను జిల్లాలోని అన్ని పాఠశాలలకు అందజేశాం. ప్రభుత్వ తాజా ఉత్తర్వుల మేరకు ప్రభుత్వ పాఠశాలల ఆవరణల్లో కుల, మత, రాజకీయ, ఇతరత్రా సమావేశాలు, సభలు నిర్వహించకూడదు. ప్రధానోపాధ్యాయులు అలాంటి కార్యక్రమాలకు పాఠశాలల ఆవరణలు ఇవ్వకూడదు. నిబంధనలు అతిక్రమిస్తే ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు బాధ్యులవుతారు.

- మాణిక్యం నాయుడు, డీఈవో, విజయనగరం



అయ్యప్పస్వామిని రథంపై ఊరేగిస్తున్న భక్తులు



మామిడిపల్లిలో పాలకావిళ్లతో అయ్యప్పదీక్షాధారుల తిరువీధి

ఘనంగా అయ్యప్ప పాలకావిళ్ల సంబరం

సాలూరు/ సాలూరు రూరల్, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): కార్తీక పౌర్ణమి సందర్భంగా అయ్యప్ప దీక్షాధారులు పాలకావిళ్లతో శుక్రవారం తిరువీధులు నిర్వహించారు. సాలూరు పట్టణం, పరిసర గ్రామాలైన గుమడాం, శివరాంపురం, కూర్మరాజుపేట, జీగిరాం, జన్నివలస, కొట్టక్కి, మామిడిపల్లి తదితర గ్రామాలకు చెందిన భక్తులు పాల కావిళ్లతో సాలూరు చేరుకున్నారు. పట్టణంలో ఊరేగింపు నిర్వహించారు. అయ్యప్ప స్వామికి పెద్దఎత్తున అభిషేకాలు చేశారు. సాలూరులో కేరళ వాయిద్యాలతో ఓ సన్నిధానం భక్తులు అయ్యప్పస్వామి తిరువీధి నిర్వహించారు.

నైపుణ్యాలు పెంచేందుకే సర్వే: కలెక్టర్


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ అంబేద్కర్

విజయనగరం కలెక్టరేట్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): నిరుద్యోగులైన 15 నుంచి 59 సంవత్సరాల మధ్య గల స్త్రీ, పురుషులకు, ప్రైవేటు రంగంలో పని చేస్తున్న వారికి అవసరమైన నైపుణాలను అందించడానికి రాష్ట్ర ప్రభుత్వం నైపుణ్య సర్వే నిర్వహిస్తోందని కలెక్టర్ అంబేద్కర్ తెలిపారు. ఈ సర్వే నాణ్యంగా జరిగేలా చూడాలని ఆదేశించారు. శుక్రవారం సాయంత్రం ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి మండలం, మున్సిపాల్టీలో సచివాలయ సిబ్బందికి సర్వేకి అవసరమైన శిక్షణలు ఈ నెల 18 నుంచి 21లోగా పూర్తి చేయాలని సూచించారు. నైపుణ్యం యాప్‌లో సంపూర్ణ డేటా నమోదు చేయాలన్నారు. అన్ని విద్యా సంస్థల్లో సర్వే చేయాలని సూచించారు.

మార్చిలోగా ఎంఎస్ఎంఈల సర్వే

కేంద్ర ప్రభుత్వ పథకంలో భాగంగా ఎంఎస్ఎంఈ పరిశ్రమలన్నిటినీ వచ్చే మార్చిలోగా సర్వే పూర్తి చేయాలని కలెక్టర్ అంబేద్కర్ ఆదేశించారు. శుక్రవారం సాయంత్రం తన చాంబర్‌లో పరిశ్రమల శాఖ అధికారులుతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ సర్వే పూర్తి చేయడానికి సచివాయ సిబ్బంది సేవలను వినియోగించుకోవాలని తెలిపారు

రోడ్డు పనులు ప్రారంభం కావాలి

జిల్లాలోని రోడ్డులపై గుంతలు పూడ్చేందుకు ప్రభుత్వం మంజూరు చేసిన పనులన్నీ ఈ నెలాఖరులోగా ప్రారంభించాలని కలెక్టర్ బీఆర్ అంబేద్కర్ ఆదేశించారు. జిల్లాలో మంజూరైన మొత్తం 68 రోడ్డు పనులకు గాను ఇప్పటికీ 22 పనులు ప్రారంభమైనట్లు రోడ్లు, భవనాల శాఖ ఎస్ఈ కాంతి మతి వివరించారు. ఈ నెలాఖరు నాటికి 79 కిలోమీటర్ల నిడివి గల రోడ్లకు మరమ్మతులు పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని వివరించారు. ఈ సమావేశంలో ఈఈ జేమ్స్, డీఈలు పాల్గొన్నారు .

కార్యదర్శి యాప్‌తో ఇసుక

జిల్లాలో 48 ఇసుక రీచ్‌లు అందుబాటులో ఉన్నాయని... ప్రతి రీచ్‌కు ఒక పంచాయితీ కార్యదర్శిని ఇన్‌చార్జిగా పెట్టినట్టు కలెక్టర్ అంబేద్కర్ తెలిపారు. ఇసుక కావలసిన వారు కార్యదర్శి యాప్‌లో రిజిస్టర్ చేసుకుని రసీదు పొందిన తరువాత తీసుకుని వెళ్లవచ్చని తెలిపారు. పోలీసు లు అడ్డుకుంటే.. రసీదును చూపిస్తే వదిలేస్తారని చెప్పారు. సంబంధిత అధికారులతో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. రేగిడి ఆమదాలవలస మండలం కె.వెంకటాపురం వద్ద 72 వేల మెట్రిక్ టన్నులకు మాన్యువల్‌గా అనుమతి లభించిందని తెలిపారు. ఈ సమావేశంలో జేసీ సేతుమాధవన్, డ్వామా పీడీ కల్యాణ చక్రవర్తి, డీపీవో వెంకటేశ్వరరావు, జెడ్పీ సీఈవో సత్యనారాయణ; ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ ఉమా శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

కంప్యూటరీకరణలో జాప్యం వద్దు

సహకార సంఘాల కంప్యూటరీకరణ లో జాప్యం చేసేవారిపై చర్యలు తప్పవని కలెక్టర్ అంబేద్కర్ ఆదేశించారు. శుక్రవారం రాత్రి సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ నెల 19 నాటికి సభ్యుల నమోదు పూర్తి చేయాలని ఆదేశించారు.

భక్తి శ్రద్ధలతో ఆకాశజ్యోతి ప్రజ్వలన


కాగడాను సిద్ధం చేస్తున్న ఎంపీ శ్రీభరత్

శృంగవరపుకోట రూరల్/ జామి, నవంబరు 15 : రాజీపేట గ్రామంలో ఉన్న శంబలనగరి ఆశ్రమంలో కార్తీక పౌర్ణమి సందర్భంగా శుక్రవారం ఆకాశజ్యోతి వెలిగించారు. విశాఖ ఎంపీ శ్రీభరత్ విచ్చేసి ఆకాశజ్యోతి ప్రజ్వలన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కేబీఏ రాంప్రసాద్, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి రాయవరపు చంద్రశేఖర్, జీఎస్ నాయుడు తదితరులు పాల్గొన్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. మండల కేంద్రమైన జామి శ్రీ స్వర్ణాకర్ష త్రిపురాంతకస్వామి ఆలయ ఆవరణలో రైతులు జ్వాలాతోరణ కార్యక్రమం శుక్రవారం రాత్రి నిర్వహించారు.

ఘనంగా కుంభాభిషేకం

కొత్తవలస, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): తుమ్మికాపల్లి గేట్ సమీపంలోనున్న శ్రీసంతోషి మాత అమ్మవారి ఆలయంలో కార్తీక పౌర్ణమి సందర్భంగా శుక్రవారం మహా కుంభాభిషేకాన్ని ఘనంగా నిర్వహించారు. శుక్రవారం తెల్లవారు జాము నుంచే మహిళలు క్యూలైన్‌లలో బిందెల తో నీళ్లు పట్టుకుని అమ్మవారికి అభిషేకాలను చేశారు. కార్తీక పౌర్ణమి సందర్భంగా శుక్రవారం మండలంలోని శివాలయాలు భక్తులతో కిటకిట లాడాయి. వివిధ శివాలయాలలో ఉదయం రుద్రాభిషేకాలను నిర్వహించారు.

బొబ్బిలి, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): కార్తీక పౌర్ణమి సందర్భంగా బొబ్బిలి ప్రాంతంలోని ఆలయాలు, నదీతీరాలు దీపాల వెలుగులో శోభాయమానమయ్యాయి. వేకువ జామునుంచి ఆలయాలన్నీ భక్తులతో కిటకిటలాడాయి. పెంట, పారాది, అలజంగి, కారాడ వేగావతి నదీ పరీవాహక ప్రాంతాలలో భక్తులు స్నానమాచరించి.. నదిలో దీపాలను విడిచిపెట్టారు. హిందూ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో స్థానిక శ్రీవేణుగోపాల స్వామి, శ్రీఆంజనేయ స్వామి ఆలయాల్లో లక్ష దీపారాధన చేశారు.

విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ యోచన వద్దు



ర్యాలీలో పాల్గొన్నవిద్యార్థులు

విజయనగరం దాసన్నపేట, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్రలో ఎంతో మందికి జీవనో పాధి కల్పిస్తున్న విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ యోచ నను తక్షణమే విరమిం చాలని వైవీఎస్ మహాదేవన్ డిమాండ్ చేశారు. శుక్రవారం పీడీఎస్ఓ జిల్లా నాయకులు కె.సోమేష్, బి.రాజేష్‌ల అధ్యక్షతన ఎంఆర్ లేడీస్ క్లబ్‌లో 'ఉత్తరాంధ్ర కరువు, వలసలు, విద్యా ఉపాధి రంగాలు-కర్తవ్యాలు' అనే అంశంపై ఉత్తరాంధ్ర విద్యార్థుల సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రధాన వక్తగా మహాదేవన్ మాట్లాడుతూ, రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఎగ్గొట్టిన చందంగానే ఉత్తరాంధ్రకు కేంద్ర ప్రభుత్వం అన్యాయం చేసిందన్నారు. రాష్ట్ర విభజన చట్టంలోని ఒక్క అంశాన్ని కూడా సంపూర్ణంగా నేటికీ అమలు చేయలేదన్నారు. పీడీఎస్ఓ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎ.సురేష్ మాట్లాడుతూ విద్య, వైద్యం, ఉపాధి అవకాశాలు ఉత్తరాంధ్ర యువతకు అందుబాటులో లేవన్నారు. ఈ కార్యక్రమంలో టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి భానుమూర్తి, జనసాహితీ సభ్యులు టి.మోహనరావు, పీడీఎస్ఓ ప్రతినిధులు భాస్కర్, పి.విశ్వనాథ్, కె.గౌతమి, రుద్రి, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

గణితంపై అవగాహన సదస్సు

విజయనగరం రూరల్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): నగరంలోని మహారాజా స్వయం ప్రతిపత్తి కళాశాలలో గణిత విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా చెన్నై మేథమెటిక్స్ అసోసియేట్ ప్రొఫెసర్ ఎం.సుందరి హాజరయ్యారు. ప్రిన్సిపాల్ ఎం.సాంబశివరావు, గణిత విభాగాధిపతి ఎస్.సూరిబాబు, అధ్యాపకులు, ఉమా శంకర్, పాల్గొన్నారు.

సచివాలయ సిబ్బంది ఎక్కడ?

బొబ్బిలి రూరల్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): సచివాలయాల ఉద్యోగులు సకాలంలో విధులకు రాకపోవడం... కొందరు పూర్తిగా ఎగ్గొట్టడం చేస్తున్నారు. శుక్రవారం ఉదయం 11 గంటలకు కోమటిపల్లి సచివాలయాన్ని పరిశీలించగా ఒక వీఆర్‌ఏ ఉన్నారు. మిగతా సిబ్బంది కుర్చీలు ఖాళీగా దర్శనమిచ్చాయి. దీనిపై వీఆర్‌ఏని అడగగా పొంతన లేని సమాధానం చెప్పారు. కార్యదర్శి కె.శ్రీనివాసరావును సంప్రదించగా.. 'పనులు ఉంటాయండి..., రోజంతా సచివాలయంలోనే ఉండాలేంటి?' అన్ని ప్రశ్నించారు ఎంపిడివో పి.రవికుమార్‌ను వివరణ కోరగా సిబ్బందికి మెమో ఇచ్చి వివరణ కోరతామన్నారు.

30 మంది రక్తదానం

గుర్ల, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): స్థానిక గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా 30 మంది యువకులు శుక్రవారం రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ ఛైర్మన్ కేసలి అప్పారావు, ఆహార భద్రత, ఫుడ్ విజిలెన్స్ కమిటీ మెంబర్ వి.పద్మలత, లైబ్రేరియన్ రామారావు, ఉపాధ్యాయిని చిన్నదేవి, సర్పంచ్ ఇజ్జిరోతు ప్రసాద్, ఎంపీటీసీ సీతారాం పాల్గొన్నారు.

రెల్లి కార్పొరేషన్ ఛైర్మన్‌గా అవకాశం ఇవ్వండి

విజయనగరం దాసన్నపేట, నవంబరు 15: (ఆంధ్రజ్యోతి): రెల్లి కార్పొరేషన్ ఛైర్మన్ పదవిని విజయనగరం జిల్లా వారికి ఇవ్వాలని ఆ సంక్షేమ సంఘ రాష్ట్ర కార్యదర్శి ఇసుకపల్లి వెంకటేశ్వరరావు అన్నారు. శుక్రవారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు.

పైడిమాంబకు స్వర్ణ పుష్పార్చన


స్వర్ణ పుష్పార్చన చేసిన దృశ్యం

విజయనగరం రూరల్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్ర ప్రజల ఆరాధ్యదైవం, సిరుల తల్లి పైడిమాంబకు శుక్రవారం కార్తీక పౌర్ణమిని పురస్కరించుకుని స్వర్ణ పుష్పార్చన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉదయం సుప్రభాత సేవ, పంచామృతాభిషేకాలు నిర్వహించారు. విజయనగరంలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం మూడులాంతర్లులోని చదురుగుడి వద్ద హోమం నిర్వహించారు.

అంగన్‌వాడీ కార్యకర్త తీరుపై ఆగ్రహం

సంతకవిటి, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): మామిడిపల్లి గ్రామంలో ఓ అంగన్‌వాడీ కార్యకర్త ఐదేళ్ళ బాలుడు కొల్ల ప్రణీత్ కుమార్‌పై దాడిచేసినట్టు తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. బుధవారం బాలుడి నోటికి ప్లాస్టర్ వేసి, చేతులు వెనక్కి తాడుతో కట్టినట్టు తల్లిదండ్రులు రామినాయుడు, మీనా ఆరోపించారు. ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. దీనిపై వారు అంగన్వాడీ కేంద్రానికి వెళ్లి కార్యకర్తను నిలదీశారు. భయపెట్టడానికి అలా చేశానని బదులిచ్చిందని వారు తెలిపారు. తల్లిదండ్రులు ఆంధ్రజ్యోతితో చెప్పారు. ఈ విషయమై అంగన్వాడీ కార్యకర్తతో మాట్లాడేందుకు ఫోన్ చేయగా ఆమె అందుబాటులోకి రాలేదు.

సచివాలయాల తనిఖీ

రాజాం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): గడ్డిముడిదాం. డీఆర్ వలస. ఆగూరు, కంచరాం సచివాలయాలను ఎంపీడీఓ శ్రీనివాసరావు శుక్రవారం తనిఖీ చేశారు. సిబ్బంది సమయపాలన పాటించాలని. పౌర సేవలు ప్రజలకు అందించాలని సూచించారు.

టీచర్‌కు అభినందన

బొబ్బిలి, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఇటీవల ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును స్వీకరించిన స్థానిక మున్సిపల్ పాఠశాల ఉపాధ్యాయిని ఉషారాణిని డీఈఓ మాణిక్యాలనాయుడు శుక్రవారం అభినందించారు. మిగిలిన ఉపాధ్యాయులకు ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు.

నేడు శిక్షణ

గజపతినగరం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): పంచాయితీ అభివృద్ధి ప్రణాళికపై శనివారం శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ బి.కల్యాణి శుక్రవారం తెలిపారు. ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరు కావాలని కోరారు.

న్యూస్ బాక్స్

కోటమ్మ ఆదాయం రూ.6 లక్షలు

శృంగవరపుకోట రూరల్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్రుల ఇలవేల్పు కొట్టాం కోటమ్మతల్లి ఆలయ హుండీని శుక్రవారం ఈవో జి.శ్రీనువాసరావు ఆధ్వర్యంలో లెక్కించారు. హుండీ ద్వారా రూ.6,21,650 ఆదాయం లభించిందన్నారు. ఈ కార్యక్రమంలో దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

బిర్సాముండా జయంతి

శృంగవరపుకోట, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): శృంగవరపుకోట పట్టణంలో గిరిజన యోధుడు బిర్సాముండా జయంతిని ఘనంగా నిర్వహించారు. గిరిజనులతో కలసి స్థానిక జనసేన నాయకుడు ఒబ్బిన సన్యాసినాయుడు బిర్సాముండా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. గిరిజనులు నివశించే రేగ పుణ్యగిరికి మౌలిక వసతులు కల్పించాలని కలెక్టర్‌కు వినతి పత్రం అందించినట్లు తెలిపారు.

తైక్వాండో పోటీల్లో ప్రతిభ


పతకాలతో చిన్నారులు

రామభద్రపురం, నవంబరు 15: (ఆంధ్రజ్యోతి): ఈ నెల 10న జిల్లా కేంద్రంలో జరిగిన జిల్లా స్థాయి తైక్వాండో సబ్ జూనియర్ విభాగంలో స్థానిక గ్లోబల్ వ్యూ స్కూల్ విద్యార్థులు పతకాలు సాధించారని కోచ్ సుధాకర్ తెలిపారు. ఈ పోటీల్లో టి.లిఖిత గోల్డ్ మెడల్, టి.తశ్విక రావ్ బ్రాంజ్ మెడల్ సాధించారని తెలిపారు. వీరిని స్కూల్ ఛైర్మన్ పోల వెంకటరమణ, కరస్పాండెంట్ చంద్రమోహన్, ప్రిన్సిపాల్ సంధ్య అభినందించారు.

దైవ కార్యాలతో ప్రశాంతత

గుర్ల, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): దైవ కార్యాల్లో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి కిమిడి రామ్‌మల్లిక్‌నాయుడు అన్నారు. పాలవలస గ్రామంలో టీడీపీ నాయకులు సుంకరి రమణమూర్తి ఇంటిలో అయ్యప్ప దీక్ష తీసుకున్న స్వాములతో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర బీసీ సెల్ ఆర్గనైజింగ్ సెక్రటరీ వెన్నె సన్యాసినాయుడు, జిల్లా బీసీ సెల్ ఆర్గనైజింగ్ సెక్రటరీ తాడి శ్రీనివాసరావు, నియోజకవర్గ టీడీపీ బీసీ సెల్ కార్యదర్శి మండల అప్పలనాయుడు పాల్గొన్నారు.

18న వీఆర్‌ఏల రాయబారం

వేపాడ, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): వీఆర్‌ఏల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 18న సీసీఎల్‌ఏ కార్యాలయం వద్ద రాయబార కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టు సంఘ రాష్ట్ర అధ్యక్షుడు గట్టు వెంకన్న తెలిపారు. ఈ మేరకు శుక్రవారం తహసీల్దార్ జె.రాములమ్మకు వినతిపత్రం అందజేశారు.

25 నుంచి 108 ఉద్యోగుల సమ్మె

శృంగవరపుకోట, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఈనెల 25 నుంచి సమ్మె చేస్తున్నట్లు 108 ఉద్యోగులు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఉద్యోగ సంఘ సభ్యులు స్థానిక తహసీల్దార్ అరుణ కుమారి, ఎంపీడీవో సతీష్‌లకు వేర్వేరుగా వినతిపత్రాలు అందించారు. సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

104ను ప్రభుత్వమే నిర్వహించాలి

వేపాడ, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి):104 సర్వీసులను ప్రభుత్వం నిర్వహించడంతో పాటు తమ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని సిబ్బంది కోరారు. ఈమేరకు శుక్రవారం గ్రామ సర్పంచులకు వినతి పత్రాలను అందజేశారు. ప్రతి నెల వేతనాలు సక్రమంగా చెల్లించేలా చర్యలు చేపట్టాలని కోరారు. ఎంప్లాయీస్ యూనియన్ గౌరవాధ్యక్షులు అప్పలసూరి, అధ్యక్షులు రామరాజు, ప్రధాన కార్యదర్శి జగన్ మోహన్ పాల్గొన్నారు.

ప్రణాళికలు సిద్ధం చేయండి

దత్తిరాజేరు, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీల అభివృద్ధి ప్రణాళికను సిద్ధం చేయాలని డిప్యూటీ సీఈవో వెంకటరమణ అన్నారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళికా శిక్షణా కార్యక్రమం నిర్వహించారు ఈ కార్యక్రమంలో అబ్జర్వర్ సుబ్బారావు, ఎంపీడీవో రాజేంద్రప్రసాద్, ఈఓపీఆర్‌డీ వాణిశ్రీ పాల్గొన్నారు.

నేడు శిక్షణ తరగతులు

గరివిడి, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీలలో అభివృద్ధి కార్యక్రమాలపై మండల, గ్రామ స్థాయి అధికారులకు శనివారం ఒక్కరోజు శిక్షణ కార్యక్రమం చేపడుతున్నట్టు ఎంపీడీవో సుబ్రహ్మణ్యం తెలిపారు. శనివారం ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఈ కార్యక్రమం జరుగుతుందని తెలిపారు.

క్రైం కార్నర్

ఎస్.కోటలో వ్యక్తి ఆత్మహత్య

శృంగవరపుకోట, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): స్థానిక శ్రీనివాస కాలనీలో ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికులు అందించిన వివరాల ప్రకారం తూర్పుగోదావరి జిల్లా అత్రేయపురం మండలం నరికేదిమిల్లిపాలెం గ్రామానికి చెందిన సీహెచ్ నాగేంద్ర శ్రీనివాస కాలనీలో ఉంటున్నాడు. అతని భార్య గర్భవతి కావడంతో పుట్టింటికి వెళ్లింది. కొన్నాళ్లుగా ఆయన ఇంట్లో ఒంటరిగా ఉంటున్నాడు. శుక్రవారం ఉదయం నుంచి భార్య ఫోన్ చేస్తున్నా లిఫ్ట్ చేయకపోవడంతో ఎస్.కోటలో వేరే చోట ఉన్న బంధువులకు ఫోన్ చేసి చెప్పింది. దీంతో వారు ఇంటికి వచ్చి పిలిచారు. వాళ్లు ఇంటికి చేరుకొని తలుపులు కొడితే తెరవలేదు. కిటికిలో నుంచి చూస్తే ఉరేసుకొని ఉన్నాడు. వారు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ వి.ఎస్.మూర్తి తెలిపారు. భార్య, అతని కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చామని తెలిపారు.

మహిళపై ఉపాధ్యాయుడి అత్యాచారయత్నం

శృంగవరపుకోట, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఓ ఉపాధ్యాయుడు మహిళపై అత్యాచార యత్నం చేసినట్లు శృంగవరపుకోట పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. గంట్యాడ మండల పరిధిలోని ఓ గ్రామానికి చెందిన మహిళ పెద్ద కుమారుడికి చెందిన స్టడీ సర్టిఫికెట్‌లో ఒకలా, ఆధార్ కార్డులో మరోలా ఇంటి పేరు ఉంది. ఈ విషయమై ఆ గ్రామ ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయుడి వద్దకు వెళ్లింది. పేరును సరిచేసేందుకు సహకరించాలని కోరింది. గురువారం ప్రధానోపాధ్యాయుడు ఆధార్ కార్డులో పేరు సరిచేసేందుకు శృంగవరపుకోట రావాలని కబురుపెట్టాడు. ఎస్.కోట ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద ఆ మహిళను ద్విచక్ర వాహనంపై ఎక్కించుకున్నాడు. గతంలో పనిచేసిన హెచ్‌ఎం ఇంటికి వెళదామంటూ బొడ్డవర గ్రామ పరిధిలోని తోటల్లోకి తీసుకు వెళ్లాడు. తన కోరిక తీరిస్తే సర్టిఫికెట్ ఇస్తానంటూ బలవంతం చేయబోయాడు. మహిళ పెద్దగా కేకలు వేయడంతో వదిలేశాడు. ఎవరికీ చెప్పొద్దని బతిమలాడాడు. తిరిగి వచ్చేస్తున్న మహిళను ద్విచక్ర వాహనంపై ఎక్కించుకొని ఎస్.కోట పందిరప్పన్న కూడలి వద్ద దించాడు. తన మాట వినలేదని అక్కడ కూడా ఆమెను దూషించాడు. దీంతో మానసికంగా కుంగిపోయిన మహిళ రాత్రి 7గంటల సమయంలో విజయనగరం మహిళా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. అక్కడి నుంచి శృంగవరపుకోట పోలీస్ స్టేషన్‌కు వచ్చిన మహిళ రాత్రి 9 గంటల సమయంలో ఇక్కడ కూడా ఫిర్యాదు ఇచ్చింది. సీఐ వి.ఎస్.మూర్తి కేసు నమోదు చేసినట్లు తెలిపారు. కేసు నమోదు కాకుండా చేయడానికి కొందరు పెద్దలు యత్నించినట్లు తెలిసింది.

బెల్లం ఊట ధ్వంసం

బొబ్బిలి రూరల్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): కొయ్యకొండవలస గ్రామ పరిధిలో శుక్రవారం సుమారు 400 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసినట్లు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ పి.చిన్నం నాయుడు తెలిపారు. ఈ దాడుల్లో ఎస్ఐ శ్రావణ్ కుమార్, హెడ్ కానిస్టేబుల్ మెట్ట శ్రీనివాసరావు, కానిస్టేబుల్ ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారని తెలిపారు. కోమటిపల్లి గ్రామానికి చెందిన చోడి పైడిరాజు నుంచి సుమారు రూ.6,780 విలువ గల 46 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

ట్రాక్టర్ల యజమానులకు జరిమానా

బొండపల్లి, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): కనిమెరక గ్రామ పంచాయతీ పరిధిలోని చెరువులో అక్రమంగా గ్రావెల్‌ను తవ్వి తరలిస్తుండగా బొండపల్లి పోలీసులు నాలుగు ట్రాక్టర్లను పట్టుకొని పోలీసు స్టేషన్‌కు శుక్రవారం తరలించారు. ఈ మేరకు పట్టుకున్న నాలుగు ట్రాక్టర్లకు సంబంధించి చర్యల నిమిత్తం ఎస్ఐ యు.మహేష్.. తహసీల్దార్ రాజేశ్వరరావుకు అప్పగించినట్టు తెలిపారు. ఒక్కొక్కరికి రూ.4వేల చొప్పున రూ.16 వేలు జరిమానా విధించినట్లు తహసీల్దార్ తెలిపారు.

కుక్కల దాడిలో గొర్రెల మృతి

తెర్లాం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): కూనాయవలస గ్రామంలో వీధి కుక్కల దాడిలో శుక్రవారం 8 గొర్రెలు మృతి చెందాయి. గురువారం రాత్రి శాలలోకి వీధి కుక్కలు దాడి చేశాయని రైతు అప్పయ్య తెలిపారు. ప్రభుత్వం తమని ఆదుకోవాలని కోరాడు.

పిచ్చికుక్క స్వైర విహారం

బొబ్బిలి రూరల్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): కృష్ణాపురం గ్రామంలో శుక్రవారం పిచ్చి కుక్క స్వైర విహారం చేసింది. చుక్క సింహాచలం, బలగ శంకరరావు ఆవులపై దాడి చేసింది. గ్రామ సచివాలయ వెటర్నరీ అసిస్టెంట్‌ను గాయపరిచింది.

మద్యం దుకాణం వద్దంటూ నిరసన


నిరసన తెలుపుతున్న శివరామరాజుపేట మహిళలు

శృంగవరపుకోట, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): శృంగవరపుకోట నుంచి శివరామరాజు పేట వెళ్లే రోడ్డులో మద్యం దుకాణం ఏర్పాటు చేయెద్దని మహిళలు డిమాండ్ చేశారు. శుక్రవారం మద్యం దుకాణం ఏర్పాటుకు నిర్మించిన షెడ్డు వద్దకు శివరామరాజుపేట గ్రామ మహిళలు చేరుకున్నారు. నిరసన చేపట్టారు. ఇప్పటికే ఈ రోడ్డులో మద్యం తాగేందుకు వస్తున్న వారితో ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పుడు ఏకంగా మద్యం దుకాణం పెడుతున్నందున ఒంటరిగా వచ్చే మహిళలపై అఘాయిత్యాలు జరిగే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.

సహకార సంఘాల బలోపేతానికి కృషి


మాట్లాడుతున్నరమేష్ తదితరులు

విజయనగరం రూరల్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): దేశ వ్యాప్తంగా సహకార సంఘాల బలోపేతానికి కృషి జరుగుతున్నదని జిల్లా సహకార అధికారి రమేష్ అన్నారు. జిల్లా మార్కెట్ సహకార సంఘంలో శుక్రవారం అఖిల భారత వారోత్సవాలు ప్రారంభమయ్యాయి. ముందుగా జవహర్‌లాల్ నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పారిశ్రామిక రంగంలో కూడా సహకార సంఘాల ప్రాధాన్యాన్ని పెంచేందుకు ప్రభుత్వం దృష్టి సారించిందన్నారు. సహకార బ్యాంకు సీఈఓ ఉమామహేశ్వరరావు ,ఈసీఎం సమన్వయ అధికారి శ్రీనివాస్, ఆడిట్ అధికారి సన్యాసినాయుడు, బిజినెస్ మేనేజర్ బీవీఎస్ సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

సహకరించండి

లక్కవరపుకోట, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): సహకార సంస్థల బలోపేతానికి రైతులు సహకరించాలని కోఆర్డినేటర్ ఎస్ఎల్ఎస్‌టీ శ్రీనివాస్ కోరారు. శుక్రవారం ఎల్.కోట సహకార సంఘాన్ని సందర్శించి రైతులతో మాట్లాడారు.

ఉన్నత విలువలతో జీవించాలి

రేగిడి, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): మనుషులు ఉన్నత విలువలతో జీవించాలని సాధుపరిషత్ అధ్యక్షులు శ్రీనివాసానంద స్వామిజీ తెలిపారు. రేగిడి దత్తపీఠంలో శుక్రవారం దత్తగురువు కిమిడి సత్యన్నారాయణ అధ్యక్షతన దివ్యజ్ఞాన సత్సంగ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాసానంద స్వామీజీ, సత్యసాయి ప్రతినిధి ఎన్‌వీరమణ, డా.దుర్గాప్రసాద్, జి.దామోదర్‌రావు పాల్గొన్నారు.

సీఎం సహాయ నిధికి రూ.8.95 లక్షల విరాళం



కలెక్టర్‌కు చెక్కును అందించిన జీఎంఆర్ ప్రతినిధులు

విజయనగరం కలెక్టరేట్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి సహాయనిధికి జీఎంఆర్ గ్రూపు రూ 8,95,496 విరాళాన్ని అందజేసింది. ఈ మొత్తాన్ని కలెక్టర్ అంబేడ్కర్‌కు సంస్థ ప్రతినిధులు శుక్రవారం అందించారు. వారిని కలెక్టర్ అంభినందించారు. ఈ కార్యక్రమంలో జీఎంఆర్ వరలక్ష్మి ఫౌండేషన్ డైరెక్టర్ గిరీష్, జీఎంఆర్ ఐటీ ప్రిన్సిపాల్ ప్రసాద్ పాల్గొన్నారు.

వాటర్ ప్యూరిఫికేషన్ ప్రాజెక్టు ఏర్పాటు చేయండి

విజయనగరం, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): చెన్నై ఈసీఆర్ రోడ్డులో ఉన్న ఇండస్ట్రియల్ వాటర్ ప్యూరిఫికేషన్ ప్రాజెక్టును విజయనగరం పార్లమెంటు పరిధిల ఏర్పాటు చెయ్యాలని ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు వినతిపత్రం అందజేశారు. శుక్రవారం ఢిల్లీ చేరుకున్న సీఎంకు కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు, ఇతర ఎంపీలు ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా సీఎంను కలిసిన ఎంపీ కలిశెట్టి వాటర్ ప్యూరిఫికేషన్ ప్రాజెక్టుకు సంబంధించిన వినతిపత్రం అందించారు.

‘కొనుగోలు’ ఏదీ?

(ఐదో పేజీ తరువాయి)

నిల్వ చేసుకోలేక తక్కువ ధరకే వ్యాపారులకు విక్రయించాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. దీనిపై ఉన్నతాధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని జిల్లావాసులు కోరుతున్నారు.

కేంద్రాల ప్రారంభానికి చర్యలు

జిల్లాలో 183 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించేందుకు చర్యలు చేపడుతున్నాం. దీనికి సంబంధించి ఇప్పటికే సిబ్బందికి శిక్షణ ఇచ్చాం. బ్యాంకు గ్యారంటీల విషయమై మిల్లర్లకు ఆదేశాలు జారీ చేశాం. గిట్టుబాటు ధరకే ధాన్యం కొనుగోలు చేస్తాం. రైతులు కూడా వారికిష్టమైన మిల్లులకు పంట తరలించుకోవచ్చు. తొందరపడి దళారులు, ప్రైవేట్ వ్యాపారులను ఆశ్రయించడం మంచిది కాదు.

- శ్రీనివాసరావు, జిల్లా పౌర సరఫరాల సంస్థ అధికారి, పార్వతీపురం మన్యం

ప్రభుత్వానికి సహకరిస్తాం

ధాన్యం కొనుగోలుకు సంబంధించి ప్రభుత్వానికి పూర్తిస్థాయిలో సహకరిస్తాం. గత వైసీపీ ప్రభుత్వ ఐదేళ్ల కాలంలో రూ. 35 కోట్ల వరకు బకాయిలు రావాల్సి ఉంది. ఈ సమస్యను కూటమి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాం. బకాయిలు విడుదల చేస్తే మాకు కొంతమేర ఉపశమనం కలుగుతుంది. కూటమి ప్రభుత్వం మమ్మల్ని ఆదుకుంటుందని ఆశతో ఉన్నాం. ఈ నెల 20లోపు బ్యాంకు గ్యారెంటీలు ఇస్తాం. నిబంధనల మేరకు ధాన్యం కొనుగోలు ప్రక్రియ జరుగుతుంది.

- అక్కేన మధుసూదనరావు, జిల్లా మిల్లర్ల అసోసియేషన్ ఉపాధ్యక్షుడు

ఇంటింటికీ జియోట్యాగింగ్

(ఐదో పేజీ తరువాయి)

ఉంచుకొని ఇళ్లకు జియోట్యాగింగ్ చేపట్టాలని నిర్ణయించింది. వ్యక్తి పేరు, ఆధార్ నెంబర్, మొబైల్ నెంబర్ లేదా ఇంటి నెంబర్.. ఇలా ఏదో ఒక దానితో వ్యక్తి వివరాలు ఉండే ప్రాంతాన్ని గుర్తించి వారికి అవసరమైన సమయాల్లో సహాయాన్ని అందించేందుకు వీలుంటుంది.

వారం రోజుల్లో పూర్తి చేస్తాం

ప్రభుత్వ ఆదేశాల ప్రకారం జియోట్యాకింగ్ కార్యక్రమం మరో వారం రోజుల్లో పూర్తయ్యే విధంగా చర్యలు తీసుకుంటున్నాం. కొన్ని మండలాల్లో కొన్ని శాఖలకు సంబంధించిన సిబ్బంది ఈ కార్యక్రమానికి సహకరించాల్సి ఉంది. మాతృ శాఖ విధుల్లో ఆ సిబ్బంది ఉన్నారు. త్వరలోనే వారి సేవలను వినియోగించుకుంటాం.

-రామచంద్రరావు, గ్రామ, వార్డు సచివాలయాల జిల్లా ప్రత్యేకాధికారి

వేగవంతం చేస్తాం

అన్ని ఇళ్లకు మ్యాపింగ్ చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. ప్రస్తుతం ఈ ప్రక్రియ కొన సాగుతుంది. సచివాలయ ఉద్యోగులు రోజూ చేపడుతున్నారు. సాధ్యమైనంత వేగంగా ఈ ప్రక్రియను పూర్తి చేయాలని సిబ్బందిని ఆదేశించాం.

-మల్లికార్జునరావు, ఎంపీడీవో, కొమరాడ

క్లస్టర్ స్థాయి క్రీడాపోటీలు ప్రారంభం

సీతంపేట రూరల్, నవంబరు15(ఆంధ్రజ్యోతి): జన్‌జాతీయ గౌరవ దివాస్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం స్థానిక గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలుర ఉన్నతపాఠశాల క్రీడా మైదానంలో క్లస్టర్ స్థాయి క్రీడాపోటీలు ప్రారంభించారు. ఈ పోటీల్లో 23 పాఠశాలల నుంచి బాల, బాలికలు పాల్గొన్నారు. వాలీబాల్, ఆర్చరీ, అథ్లెటిక్స్ క్రీడల్లో విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచారు. ఈ పోటీలను హెచ్‌ఎం చంద్రరావు, పీడీలు జాకబ్ దయానంద్, వెంకటరావు, జగదీష్, రవి, జనార్దన్, రమణ పర్యవేక్షించారు.

గండి రామినాయుడుకి శుభాకాంక్షలు

పాలకొండ, నవంబరు15(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర తూర్పుకాపు కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమితులైన పాలకొండ మండల పార్టీ అధ్యక్షుడు గండి రామినాయుడుకు శుభాకాంక్షలు వెల్లువెత్తుతున్నాయి. శుక్రవారం పెద్ద ఎత్తున పార్టీ నాయకులు, కార్యకర్తలు గండి రామినాయుడుకు శుభాకాంక్షలు తెలుపుతూ కేక్ కట్‌చేసి ఆనందం పంచుకున్నారు. తెదేపా నాయకులు సంగంనాయుడు, జి రాంబాబు, రవికుమార్, సొంబాబు, ఎం మురళీ, సాయి, కె చైతన్యకుమార్ ఉన్నారు.

నిర్దేశిత రేవుల్లోనే ఇసుక తరలించాలి

సీతానగరం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సువర్ణముఖి నదిలో నిర్ధేశించిన రేవుల్లో నుంచి భవన నిర్మాణ లబ్ధిదారులకు ఇసుక ఇవ్వడం జరుగుతుందని ఎంపీడీవో పి.త్రివిక్రమరావు అన్నారు. మండల ఉపాధి హామీ పథకం కార్యాలయంలో సచివాలయాల సర్వేయర్లు, ఇంజనీరింగ్ సహాయకులు, వీఆర్‌వోలతో ఇసుక తరలింపుపై ఏపీవో భాను ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడుతూ పలు సూచనలు చేశారు.

టిడ్కో ఇళ్లను పరిశీలించిన కమిషనర్

నెల్లిమర్ల, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): నెల్లిమర్ల నగర పంచాయతీ పరిధిలో నిర్మాణంలో ఉన్న ఎన్‌టీఆర్ నగర్‌లోని 576 టిడ్‌కో ఇళ్ల నిర్మాణాలను కమిషనర్ అప్పలరాజు శుక్రవారం పరిశీలించారు. ఇంతవరకు నిర్మాణాలు ఏ స్థాయి వరకు జరిగాయి.. ఇంకా ఎంత శాతం పని మిగిలి ఉంది, పని పూర్తయ్యేందుకు ఎంత కాలం అవసరం తదితర విషయాలపై టిడ్కో ఇంజినీరింగ్ సిబ్బంది వద్ద ఆరా తీశారు. ఎలక్ట్రికల్ స్థంభాలు, వైర్లు ఏర్పాటు పనులను ఆయన పరిశీలించారు. సారిపల్లి సమీపంలో విజయనగరానికి సంబంధించి 2656 మంది లబ్ధిదారులకు నిర్మించిన టిడ్‌కో ఇల్లను కూడా పరిశీలించారు. టిడ్కో ఏఈ సంచాన వెంకటరమణ, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఉమాభాస్కర్, అనిల్, సురేష్ తదితరులు పాల్గొన్నారు

యువకుల రక్తదానం

గుర్ల, నవంబర్ 15(ఆంధ్రజ్యోతి): స్థానిక గ్రంథాలయంలో గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా 30 మంది యువకులు రక్తదానం చేశారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు హాజరయ్యారు. గ్రంథాలయాల్లో మంచి పుస్తకాలు చదవడం అలవాటు చేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. ప్రస్తుతం రక్తనిల్వలు కొరత ఎక్కువగా ఉన్న నేపథ్యంలో రక్తదానం చేసిన 30 మంది యువతను అభినందించారు. ఆహార భద్రత, ఫుడ్ విజిలెన్స్ కమిటీ మెంబర్ వి.పద్మలత, లైబ్రేరియన్ రామారావు తదితరులు హాజరయ్యారు.

భవన నిర్మాణానికి అనుమతి ఇవ్వండి

చీపురుపల్లి, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): చీపురుపల్లిలో శిథిలావస్థకు చేరిన తహసీల్దారు భవన నిర్మాణం కోసం నిధులు మంజూరు చేయాలని చీపురుపల్లి ఎమ్మెల్యే కిమిడి కళావెంకటరావు, రాష్ట్ర పంచాయతీ రాజ్ శాఖా మంత్రి కొణిదల పవన్‌కల్యాణ్‌కు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఆయన మంత్రికి లేఖ రాశారు. చీపురుపల్లి తహసీల్దారు కార్యాలయం భవనం కొన్ని దశాబ్దాల కిందట నిర్మించారని, ఇది ప్రస్తుతం శిథిలావస్థకు చేరుకుందని, పట్టణానికి నడి బొడ్డున ఈ కార్యాలయం ప్రజలకు అందుబాటులో ఉండేదని, అదే స్థలంలో నూతన భవనాన్ని నిర్మించాల్సి ఉందని ఎమ్మెల్యే వివరించారు.

పోలీసు సమస్యల పరిష్కారానికి కృషి

బెలగాం, నవంబరు15(ఆంధ్రజ్యోతి): పోలీసుల సమస్యల పరిష్కారానికి కృషి, సంక్షేమానికి ప్రాధాన్యం ఇస్తామని ఎస్పీ ఎస్.వి.మాధవరెడ్డి అన్నారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ పోలీస్ సిబ్బంది నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణ కోసం కృషి చేస్తున్న పోలీసు సిబ్బంది సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం ఇస్తామన్నారు. ఆరోగ్యపరమైన, వృత్తి పరమైన, వ్యక్తిగత సమ స్యలు పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో ఎస్పీ కార్యాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



పోలీసు సిబ్బంది నుంచి వినతులు స్వీకరిస్తున్న ఎస్పీ మాధవరెడ్డి

వైన్‌షాప్ ఏర్పాటు తగదు



పనుకువలస గ్రామసభలో మాట్లాడుతున్న గ్రామస్థులు

పాలకొండ, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పనుకువలస గ్రామ సమీపంలో వైన్‌షాపు ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నారని, తక్షణమే ఈ ఆలోచన విరమించుకోవాలని గ్రామస్థులు, మహిళలు కోరారు. గ్రామంలో గ్రామసభను శుక్రవారం ఏర్పాటు చేశారు. గ్రామ సర్పంచ్ కె.మంజుభార్గవి, మాజీ ఎంపీపీ సామంతుల దామోదరరావు తదితరులు గ్రామస్థుల సూచనతో ఏకీభవించారు. ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని సర్పంచ్ పేర్కొన్నారు. పనుకువలస గ్రామస్థులు పాల్గొన్నారు.

స్వచ్ఛ్ మన్యంకు ప్రతి ఒక్కరూ సహకరించాలి

సాలూరు, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): స్వచ్ఛ్ పార్వతీపురం మన్యంకు ప్రతి ఒక్కరూ సహకరించాలని జిల్లా అటవీశాఖ అధికారి జీ.ప్రసూనా కోరారు. పట్టణంలో శుక్రవారం స్థానిక సీతారామ కల్యాణ మండపంలో స్వచ్ఛ్ ఆంధ్ర కార్పొరేషన్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. అనంతరం ఆమె లిక్విడ్, రిసోర్స్ మేనేజ్మెంట్‌పై అవగాహన కల్పించారు. మున్సిపల్ కమిషనర్ సత్యనారాయణ, పర్యావరణ కార్యదర్శులతో పాటు పలువురు అధికారులు హాజరయ్యారు.



మాట్లాడుతున్న ప్రసూనా

జనవాణిలో ఎమ్మెల్యే జయకృష్ణ



ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న జయకృష్ణ

పాలకొండ, నవంబ రు 15(ఆంధ్రజ్యోతి): జనసేన అధినేత, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ఆదేశాల మేరకు విజయవాడలోని మంగళగిరి జనసేన పార్టీ కార్యాలయంలో శుక్రవారం జనవాణి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాలకొండ నియోజకవర్గ శాసనసభ్యులు నిమ్మక జయకృష్ణ పాల్గొని ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. సమస్య తీవ్రతను బట్టి అప్పటికప్పుడు ఆయా శాఖల అధికారులతో నేరుగా మాట్లాడి బాధితుల సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకున్నారు.

అదనపు విధుల నుంచి విముక్తి కలిగించాలి

భోగాపురం, నవంబరు15(ఆంధ్రజ్యోతి): సచివాలయాల్లో పనిచేస్తున్న ఏఎన్‌ఎలకు ఇతరత్రా విధులనుంచి విముక్తి కలిగించాలని ఏపీఎన్‌జీవో తాలూకా అధ్యక్షుడు కొమ్మూరు దుర్గారావు ప్రభుత్వాన్ని డిమాండు చేశారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ప్రకటన విడుదల చేశారు. ఇటీవల జీవో నెంబరు 24ని ప్రభుత్వం సెప్టెంబరు 30న విడుదల చేస్తూ సచివాలయం ఏఎన్‌ఎంలకు ఆరోగ్య పథకాలకు సంబంధించిన విధులు తప్ప మరి ఏ ఇతర విధులు అప్పగించరాదని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేయగా జిల్లాలో మాత్రం అమలు కావడంలేదన్నారు. దీనిపై రాష్ట్ర ఏపీ ఎన్జీవో నాయకత్వం దృష్టికి తీసుకెళతామని ఎన్జీవో అధ్యక్షులు దుర్గారావు తెలిపారు.

శత్రుచర్లను కలిసిన కార్పొరేషన్ డైరెక్టర్లు



శత్రుచర్లను సత్కరిస్తున్న డైరెక్టర్లు మధుసూదనరావు, శేఖరపాత్రుడు

గరుగుబిల్లి, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): నూతనంగా నియామకమైన రాష్ట్ర బీసీ వెలమ కార్పొరేషన్, తూర్పు కాపు కార్పొరేషన్ డైరెక్టర్లు అక్కేన మధుసూదనరావు, శేఖరపాత్రుడు శుక్రవారం మాజీ మంత్రి శత్రుచర్ల విజయరామరాజును మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వీరు మాట్లాడుతూ కురుపాం నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీని మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తామన్నారు. తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు అంబటి తవిటినాయుడు, రాంబాబు, హిమరిక బలరాం, తదితరులు ఉన్నారు.

చైర్‌పర్సన్ రాజీనామా

పాలకొండ, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): పాలకొండ నగర పంచాయతీ చైర్‌పర్సన్ యందవ రాధాకుమారి తన పదవికి, 19వ వార్డు సభ్యత్వానికి రాజీనామా చేశారు. తన భర్త అకాల మరణంతో కారుణ్య నియామకంలో ఉద్యోగం పొందే క్రమంలో ఆమె తన వార్డు సభ్యురాలి పదవి, చైర్‌పర్సన్ పదవికి రాజీనామా చేశారు. రాజీనామా పత్రాన్ని వైసీపీ కౌన్సిలర్ల సమక్షంలో కమిషనర్ సర్వేశ్వరరావుకు అందించారు. ఈ సందర్భంగా రాధాకుమారి మాట్లాడుతూ తనకు పదవి కట్టబెట్టిన ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, మాజీ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతికి కృతజ్ఞతలు తెలిపారు.

ప్రోత్సాహకాలను సద్వినియోగం చేసుకోవాలి

గరుగుబిల్లి, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఇఫ్కో సంస్థ రాయితీపై అందజేస్తున్న ప్రోత్సాహకాలను సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ కలిశెట్టి ఇందుమతి అన్నారు. మహిళా సంఘాల సభ్యులకు ఇఫ్కో సమగ్ర రైతు సహకార సంస్థ ఆధ్వర్యంలో మైక్రో ప్లానింగ్‌లో భాగంగా రాయితీపై అందజేసిన నిత్యావసర సరుకులను శుక్రవారం ఆమె పంపిణీ చేశారు. ఇఫ్కో సంస్థ ద్వారా అందజేస్తున్న ప్రోత్సాహకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మండల ఇన్‌చార్జి టి.శంకరరావు, ఎస్.సతీష్, తదితరులు పాల్గొన్నారు.

హామీలు అమలుచేయాలి

పాలకొండ, నవంబర 15 (ఆంధ్రజ్యోతి): పేదలకు గ్రామాల్లో మూడు సెంట్లు, పట్టణాల్లో రెండు సెంట్లు ఎన్నికల్లో ఇచ్చిన హామీని ప్రభుత్వం అమలు చేయాలని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి బుడితి అప్పలనాయుడు డిమాండ్ చేశారు. ఈ మేరకు 18న నగర పంచాయతీ కార్యాలయం వద్ద నిర్వహించనున్న ధర్నాను జయప్రదం చేయాలని కోరారు. జగనన్న కాలనీలో పేదలను కలిసి సమస్యలను శుక్రవారం అడిగి తెలుసుకున్నారు. జిల్లా సహాయ కార్యదర్శి తోట జీవన మాట్లాడుతూ ఎన్నికల హామీ ప్రకారం ఇళ్ల స్థలాలు ఇవ్వాలన్నారు. వ్యవసాయ సహకార సంఘం జిల్లా కార్యదర్శి సూరయ్య, పార్టీ జిల్లా సమితి సభ్యులు త్రినాథ, జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

వైద్య సేవలందించేందుకు సిద్ధం

సీతానగరం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): స్వచ్ఛంద సేవా సంస్థలు గ్రామాల్లో చేపడుతున్న కార్యక్రమాల్లో భాగంగా వైద్యపరంగా సేవలందించడానికి సిద్ధంగా ఉన్నామని వైద్యనిపుణులు అబ్రహం అన్నారు. మండలంలోని చినభోగిలి సచివాలయం ఆవరణలో ఎనిమిది మంది వైద్య నిపుణులతో చినభోగిలి యూత్ ఆధ్వర్యంలో శుక్రవారం ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా గ్రామాల్లో కీళ్ల నొప్పులు, గుండె జబ్బులు, బీపీ, సుగర్, కంటికి సంబంధించిన వ్యాధులతో ఇబ్బందులు పడుతున్న 257 మంది వైద్య సేవలందించారు. అనంతరం స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారిణి ఉషా ఈసీజీ తీసిన రోగులను పరిశీలించి మెరుగైన వైద్య సేవలు పొందడం అవసరం ఉందన్నారు.



వైభవంగా గౌరీదేవి అనుపోత్సవం

సాలూరు రూరల్, నవంబర్ 15(ఆంధ్రజ్యోతి): మామిడిపల్లిలో గౌరీదేవి యువజన సేవ సంఘం ఆధ్వర్యంలో గౌరీదేవి అనుపోత్సవం శుక్రవారం రాత్రి వైభవంగా నిర్వ హించారు. కార్తీక చవితి నాడు గౌరీదేవిని(వరి కంకుల దుబ్బు) రాజులవీధిలో ప్రతిష్ఠించారు. చవితి నుంచి పౌర్ణమి వరకు పంటలు బాగా పండాలని కాంక్షిస్తు సంప్రదాయ బద్ధంగా పూజలు చేశారు. కార్తీక పౌర్ణమి సందర్భంగా గౌరీదేవికి వైభవంగా తిరువీధి నిర్వహించారు. తిరువీధిలో యువతులు చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. గౌరీదేవిని తిరువీధి అనంతరం అనుపోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పెద్దసంఖ్యలో యువత పాల్గొన్నారు.

ఘనంగా కార్తీక పౌర్ణమి పూజలు

గరుగుబిల్లి, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు శివాలయాల్లో శుక్రవారం రాత్రి మహిళలు ఘనంగా కార్తీక పౌర్ణమి పూజలు నిర్వహించారు. పౌర్ణమిని పురస్కరించుకుని ఉపవాసాలతో పాటు ప్రత్యేక నోములు నిర్వహించారు. శివాలయాల్లో కార్తీక దీపాలు వెలిగించి భక్తిని చాటుకున్నారు. ఆలయాల్లో ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి.

ఉమాసోమేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు

వీర ఘట్టం, నవంబర 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్ని ఆలయాల్లో కార్తీక పౌర్ణమి సందర్భంగా భక్తులు తెల్లవారుజాము నుంచి శివాలయాలకు వెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉమాసోమేశ్వరాలయంలో పెద్ద ఎత్తున భక్తులు పూజలు నిర్వహించి దీపాలు వెలిగించారు.



గొట్టివలస శ్రీకాశీ విశ్వేశ్వరస్వామి ఆలయంలో..

న్యూస్ బాక్స్

మద్యం సీసాలతో వ్యక్తి అరెస్టు

సీతానగరం, నవంబరు 15 (ఆంధ్ర జ్యోతి): ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్‌శాఖ సీతా నగరం సర్కిల్ పరిధిలోని గాదెలవలసలో శు క్రవారం నిర్వహించిన దాడుల్లో పది మ ద్యం సీసాలతో ఓ వ్యక్తిని అరెస్టు చేసినట్లు సీఐ డి. పద్మావతి తెలియజేశారు. ఈ మేరకు ఆమె మాట్లాడుతూ గాదెలవలసలో మద్యం విక్రయిస్తున్నట్లు సమాచారం మేరకు దాడు లు చేయగా ఒకరి వద్ద 10 మద్యం సీసాలను లభ్యమయ్యాయని, వాటిని స్వాధీనం చేసు కుని నిందితుడిని అరెస్టు చేశామన్నారు. సారా విక్రయాలు జరుగుతున్నట్లు, బెల్ట్ షాపు లు ఏర్పాటు చేసినట్లు తెలిసినా సమాచారం ఇవ్వాలన్నారు.

ఆలయానికి విద్యుత్ లైట్ల వితరణ

గుమ్మలక్ష్మీపురం, నవంబరు15 (ఆంధ్రజ్యోతి): గుమ్మలక్ష్మీపురం కైలాసనాథ ఆలయానికి విద్యుత్ ఎల్‌ఈడీ లైట్లను పైడా జగదీశ్వరరావు, చందు, కందుల సతీష్ వితరణగా అందించారు. వీరికి గ్రామ సర్పంచ్ గౌరీ శంకరరావు, ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ దేవాలయాల అభివృద్ధికి అంతాసహకరించాలని విజ్ఞప్తి చేశారు.

అడవులను రక్షించుకోవాలి

పార్వతీపురం రూరల్, నవంబరు15 (ఆంధ్రజ్యోతి): అడవులను రక్షించుకుని, పర్యావరణాన్ని కాపాడుకోవాలని అటవీ శాఖ రేంజ్ అధికారి శ్రీరామ్ నరేష్ బిర్లంగి అన్నారు. పార్వతీపురం మండలం సీతంపేట గ్రామంలో శుక్రవారం అటవీశాఖ అధికారులు ఆ గ్రామ ప్రజలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీరామ్ మాట్లాడుతూ అడవులను రక్షించుకుంటే మనకు ఆహారం, నీరు, స్వచ్ఛమైన గాలి దొరుకుతుందని హితవు పలికారు. కార్యక్రమంలో సెక్షన్ అధికారి మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

నీటి తీరువా వసూలు చేయాలి

భోగాపురం, నవంబరు15(ఆంధ్రజ్యోతి): నీటి తీరువా బకాయిలతో కలుపుకుని రూ.28.22 లక్షలు నీరుతీరువా వసూలు చేయాలని వీఆర్వోలకు తహసీల్దార్ ఎం.సురేష్ ఆదేశించారు. స్థానిక రెవెన్యూ కార్యాలయంలో శుక్రవారం వీఆర్వోలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నీటి తీరువా రూ.28.22 లక్షలు వసూలు చేయాల్సి ఉందన్నారు. హెచ్‌డీటీ సుభాష్, వీఆర్వోలు పాల్గొన్నారు.

విత్తనాల పంపిణీ

పాలకొండ, నవంబరు15(ఆంధ్రజ్యోతి): మండలంలో నవగాం గ్రామంలో రైతులకు శుక్రవారం మినుముల విత్తనాలను పంపిణీ చేశారు. జిల్లా వ్యవసాయశాఖాధికారి రాబర్ట్‌పాల్ వీటిని రైతులకు అందజేశారు. కార్యక్రమంలో మండల వ్యవసాయశాఖాధికారి వాణీకుమారి, సిబ్బంది పాల్గొన్నారు.

సంకల్పంపై అవగాహన

సీతంపేట రూరల్, నవంబరు15 (ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాలు, డ్రగ్స్ వినియోగం, మహిళా రక్షణ వంటి అంశాలపై విద్యార్థులకు సంకల్పం కార్యక్రమం ద్వారా అవగాహన కల్పించారు. శుక్రవారం ఎస్సై అమ్మన్నరావు ఆధ్వర్యంలో డిగ్రీ కళాశాలలో చదువుతున్న విద్యార్థులకు పలు అంశాలపై వివరించారు. చట్టాలపై ప్రతి విద్యార్థి అవగాహన కలిగి ఉండాలన్నారు. చక్కగా చదువుకుని భవిష్యత్తుకు బంగారు బాటలు వేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్, పోలీస్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

గ్రామ పంచాయతీ ప్రణాళికలు తయారు చేయాలి

సీతానగరం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీల్లో ప్రణాళికల తయారీలో 2024-25 ఆర్థిక సంవత్సరంలో మండలస్థాయి అధికారులు కీలకపాత్ర పోషించాల్సి ఉంటుందని ఎంపీడీవో పి.త్రివిక్రమరావు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జీపీడీపీ పథకం అమలు చేయడంపై శుక్రవారం మండల స్థాయి అధికారులు, వెలుగు వీవోఏలతో వెలుగు ఏపీఎం రెడ్డి శ్రీరాములు ఆధ్వర్యంలో అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు.

ఇసుక రీచ్‌లపై సచివాలయ సిబ్బందికి అవగాహన

పాచిపెంట, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఇసుక రీచ్‌లపై స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం గ్రామ సచివాలయ సిబ్బందికి అవగాహన సదస్సు నిర్వహించారు. స్థానిక ఎంపీడీవో బీవీజె పాత్రో, తహసీల్దార్ డి.రవి అవగాహన కల్పించారు.

ఘనంగా బిర్సాముండా జయంతి

గుమ్మలక్ష్మీపురం, నవంబరు15(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో సారధి ఒకేషనల్ జూనియర్ కాలేజ్‌లో ట్రైబుల్ రైట్స్ ఫోరం(టీఆర్ఎఫ్), సారధి ఒకేషనల్ కాలేజ్ యాజమాన్యం సంయుక్తంగా బిర్సాముండా జయంతి ఉత్సవాలు శుక్రవారం నిర్వహించారు. సీఐ బి.హరి, ప్రిన్సిపాల్ శేషగిరి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని మొదలుపెట్టారు. ● పార్వతీపురంటౌన్: స్థానిక గిరిజన సంక్షేమ బాలుర పోస్టు మెట్రిక్ వసతి గృహంలో ఆదివాసీ జెఏసీ ఆధ్వర్యంలో బిర్సాముండాజయంతి వేడుకలు జరిగాయి. ఈ కార్యక్రమానికి ఆదివాసీ జెఏసీ చైర్మన్ కె. ధర్మారావు ముఖ్య అతిధిగా హజరయ్యారు. ● సీతంపేట రూరల్: సీతంపేట ఐటీడీఏ కార్యాలయంలో బిర్సా ముండా జయంతి వేడుకలను శుక్రవారం నిర్వహించారు. ఐటీడీఏ ఏవో సునీల్, ఏఏవో విజయరాణి, సూపరింటెండెంట్ సిబ్బంది పాల్గొన్నారు.

● స్థానిక గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలుర ఉన్నత పాఠశాలలో బిర్సా ముండా చిత్రపటానికి ఏజేఏసి నాయకులు ధర్మా రావు, బిడ్డిక శ్రీనివాసరావు, ఉమామహేశ్వరరావులు పూలమాలను వేసి నివాళులు అర్పించారు. ● జియ్యమ్మవలస(ఆంధ్రజ్యోతి): బిర్సా ముండా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించామని ఆదివాసీ గిరిజనాభ్యుదయ సంఘం అధ్యక్షులు ఆరిక చంద్రశేఖర్ తెలిపారు. అనంతరం రావాడ రామభద్రపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు.

● భామిని: బత్తిలి, పెద్దదిమిలి సచివాలయంలో బిర్సాముండా చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులు అర్పించారు. సర్పంచ్ టింగ శాంతకుమారి, కార్యదర్శి శ్రీనివాస్‌రావు, సచివాలయ సిబ్బంది, స్థానికులు పాల్గొన్నారు.



సీతంపేటలో..



జియ్యమ్మవలసలో..



భామినిలో...



గుమ్మలక్ష్మీపురంలో..